ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 27 మే 2025
5

కేంద్ర ప్రభుత్వం నరమేధం సృష్టిస్తోంది
- వారం రోజులుగా నంబాల మృతదేహాన్ని బంధువులకు అప్పగించలేదు
- ప్రత్యర్థి దేశాలతో చేయాల్సిన యుద్ధాన్ని శవాలతో చేస్తున్నారా?
- మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

6



కొత్తగూడెం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కొవిడ్ ఐసోలేషన్ వార్డు

కొవిడ్‌పై అప్రమత్తం

- కొత్తగూడెం ఆస్పత్రిలో వార్డు ఏర్పాటు
- ముందస్తు చర్యల్లో వైద్యాధికారుల నిమగ్నం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో మళ్లీ కొవిడ్ వ్యాప్తి చెందుతుండటం.. ఇటీవలో రాష్ట్రంలో ఓ మరణం నమోదైందన్న వార్తలతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ప్రకటించినప్పటికీ భద్రాద్రి జిల్లా యంత్రాంగం మాత్రం ముందస్తు చర్యల్లో నిమగ్నమైంది. కొత్తగూడెం సర్వజన (జీజీహెచ్)లో 30 పడకలతో కొవిడ్ ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేస్తుండగా.. నిర్ధారణ పరీక్షలను ఆస్పత్రి ఆవరణలోనే నిర్వహించేందుకు గతంలో వినియోగించిన గదినే ఉపయోగించనున్నారు. ఇక ప్రజలు ఎలాంటి అనారోగ్య సమస్య ఉన్న తక్షణమే స్థానిక ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందాలని వైద్యాధికారులు సూచించారు. జిల్లాలో కొత్తగూడెంతోపాటు భద్రాచలం, మణుగూరు ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేయనున్నారు. పాజిటివ్ నమోదైన వారికి (మిగతా 6వ పేజీలో)

రాష్ట్రంలో అధికారాన్ని 'హస్త'గతం చేసుకుని ఏడాదిన్నరవుతోంది. నేటికీ నామినేటెడ్ పదవులపై తాము పెట్టుకున్న ఆశలు నెరవేరడం లేదన్న అసంతృప్తి ద్వితీయ శ్రేణి నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పార్టీ సంస్థాగత పదవుల సందడి కూడా మొదలైంది. అయితే తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి మరో మారు ఢిల్లీ వెళ్లిన నేపథ్యంలో ఈ సారి కచ్చితంగా నియామక పదవులకు మోక్షం కలుగుతుందన్న ఆశల్లో కేడర్ ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులతో కొన్ని పదవులు భర్తీకాగా మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ప్రధానంగా ఖమ్మం సుడా పాలకవర్గం, భద్రాద్రి సీతారామచంద్రస్వామి దేవస్థానం పాలకమండలి నియామకంతో పాటు ఇతర దేవాలయ కమిటీలు ఉన్నాయి. వీటికి తోడు పార్టీ సంస్థాగత పదవులు రాబోతున్నాయని, జిల్లా కమిటీలోనూ మార్పులకు అవకాశం ఉందన్న చర్చ కేడర్‌లో జరుగుతోంది.

ఈ సారైనా దక్కేనా?



నామినేటెడ్ పదవుల కోసం 'అధికార' నేతల ఎదురుచూపు

- కసరత్తులతోనే సరిపెడుతున్న అధిష్ఠానం
- కాంగ్రెస్ శ్రేణుల్లో పెరుగుతున్న అసంతృప్తి
- తాజాగా సీఎం ఢిల్లీ పర్యటనతో మళ్లీ చిగురిస్తున్న ఆశలు
- పీసీసీ సహా సంస్థాగత పదవులపైనా కసరత్తు?
- జిల్లా కమిటీల్లోనూ మార్పులకు అవకాశం

ఖమ్మం, మే 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తవుతున్నా నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తి చేయకపోవడంతో పార్టీ కేడర్‌లో అసహనం పెరిగిపోతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లినా.. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంస్థాగత పదవులు, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల నియామకంపై ఆశలు పెంచుకోవడం ఆ తరువాత నిరాశ చెందడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో తాజాగా మరోసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లగా అక్కడ పార్టీ అధిష్ఠానంతో రాష్ట్ర కేబినెట్ విస్తరణతో పాటు పీసీసీ కార్యవర్గం కూర్పు, ప్రభుత్వ కార్పొరేషన్లు, ఇతర నియామక పదవులపై చర్చిస్తున్న ప్రచారం జరుగుతుండడంతో ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ నాయకుల్లో మళ్లీ పదవులపై ఆశలు చిగురిస్తున్నాయి. ఈ సారైనా తమకు పదవులు లభిస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు.

కొందరికే దక్కిన అవకాశం..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలిరోజుల్లో ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుల్లో కొందరికి కార్పొరేషన్ పదవులు దక్కాయి. కొన్ని మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవులు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసులతో భర్తీకాగా మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా నుంచి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పొదెం వీరయ్య, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మువ్వా విజయ్ బాబు, హస్తకళా అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నాయుడు సత్యం నియమితులయారు. ఇంకా గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఆశించి నిరాశచెందిన నాయకులు కార్పొరేషన్ చైర్మన్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పలు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్ పదవుల కోసం ఎవరికి వారు తమ నేతల ద్వారా సిఫారసు చేయిస్తున్నారు. ఖమ్మం సుడా పాలకవర్గంతో పాటు భద్రాద్రి సీతారామచంద్రస్వామి (మిగతా 6వ పేజీలో)

జిల్లా కమిటీల్లో మార్పులు?

ఇక జిల్లా స్థాయిలో సంస్థాగత పదవుల నియామకంపై కూడా కసరత్తు జరుగుతోంది. రెండు జిల్లాల కాంగ్రెస్ కమిటీల్లోనూ మార్పులు చేర్పులు ఉండే అవకాశం ఉంది. పార్టీ జిల్లా అధ్యక్ష పదవితో పాటు మండల అధ్యక్ష పదవులకు ఈసారి గట్టి పోటీ నెలకొంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జూన్, జూలైలో ఉంటాయని ప్రచారం జరుగుతుండడంతో సంస్థాగత పదవుల్లో స్థానం పొందితే స్థానిక ఎన్నికల్లో టికెట్లు దక్కించుకోవడం సులభమవుతుందన్న ఆశాభావంతో కొందరు నేతలు సంస్థాగత పదవుల కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ఈసారైనా పార్టీ కేడర్‌కు పదవుల యోగం కలిపిస్తుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌కు

రూ.50వేలు డిమాండ్

- దరఖాస్తుదారుడితో నేరుగా బేరాలు
- రూ.30వేలకు ఒప్పందం..
- ఏసీబీకి చిక్కిన ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్
- డాక్యుమెంట్ రైటర్ ద్వారా తీసుకుంటుండగా పట్టివేత



ఏసీబీకి పట్టుబడిన ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్, డ్యాక్యుమెంట్ రైటర్

ఖమ్మం, మే 26 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల పేరిట ఉన్న స్థలాన్ని కుమారుడికి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం సబ్ రిజిస్ట్రార్ జెక్కి. అరుణ. గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వెళ్లిన దరఖాస్తుదారుడితో సబ్‌రిజిస్ట్రార్ నేరుగా బేరాలు ఆడి.. ఆ నగదును డాక్యుమెంట్ రైటర్ ద్వారా అందజేయాలని సూచించారు. దాంతో సంబంధిత దరఖాస్తుదారులు ఏసీబీని ఆశ్రయించగా సోమవారం రిజిస్ట్రేషన్ జరిగిన అనంతరం డబ్బులు ఇచ్చే క్రమంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలివీ.. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెం.713/ఏ2లో (మిగతా 6వ పేజీలో)

వేట బాట

- సంప్రదాయబద్ధంగా ఆదివాసీల భూమి పండుగ
- బట్టిగూడెం, తిరుమలకుంట గ్రామాల్లో సందడి
- వడ్లు, విత్తనాలు పెట్టి ప్రత్యేక పూజలు
- డప్పు వాయిద్యాలతో మార్మోగిన గ్రామాలు
- అడవుల్లో వేటకు వెళ్లిన అడవి బిడ్డలు
- వ్యవసాయానికి ముందుగా వేడుక జరపడం ఆనవాయితీ

మన్యంలో ఆదివాసీలు సాగు పనులకు ముందు జరుపుకొనే భూమి పండుగను సోమవారం సందడిగా నిర్వహించారు. ప్రకృతి ప్రేమికులుగా, భూమాత రక్షకులుగా పేరున్న అడవి బిడ్డలు గుంపులు గుంపులుగా ఒక చోట చేరి విల్లంబులు చేతపట్టారు. మగవారు వేటకోసమని అడవికి వెళ్లగా, ఆడవారు వారి కోసం విందు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ పల్లెలు డప్పు వాయిద్యాలతో మార్మోగాయి. గిరిజన గాయకులు పాటలు పాడుతుండగా పదం కలిపిన పల్లెవాసులు కదం తొక్కారు.

- ఆంధ్రజ్యోతి, అశ్వారావుపేట/ చర్ల



భూమి పండుగలో విల్లంబులు ఎక్కుపెట్టిన ఆదివాసీ మహిళలు

7



చింతకాని మండలం పందిళ్లపల్లి సమీపంలో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం

నెత్తురు చిందిన

రహదారులు..

- ఆరు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి మృతి
- అయిదు చోట్ల ద్విచక్ర వాహనాలకు యాక్సిడెంట్
- వేంసూరు ఘటనలో ఇద్దరు కన్నుమూత

ఖమ్మం జిల్లాలో వేర్వేరు చోట్ల ఆదివారం పొద్దుపోయాక, సోమవారం జరిగిన ఆరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు వ్యక్తులు మృతి చెందారు. చింతకాని, బోనకల్, వైరా, తల్లాడ, దమ్మపేట మండలాల్లో ఒక్కొక్కరు, వేంసూరు మండలం జయలక్ష్మీపురం వద్ద జరిగిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

7

'డీఆర్ఎఫ్'లో దొడ్డిదారి

నియామకాలు

- నోటిఫికేషన్ లేకుండానే ఇటీవల మరొకరికి ఉద్యోగం
- పరిమితి 20మంది కాగా.. 22కు చేరిన సంఖ్య


ఖమ్మం సంక్షేమ విభాగం, మే 26 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటర్ల సిఫారసులతో ఖమ్మం నగరపాలక సంస్థలోని డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్. 'దొడ్డిదారి డీఆర్ఎఫ్‌గా అపఖ్యాతి మూటగట్టుకుంటోంది. ఖమ్మం నగరంలో విపత్తులు ఎదుర్కోవడంతో పాటు.. సాధారణ సమయాల్లో ప్రధానమైన సమస్యలపై తక్షణం స్పందించేలా గత ప్రభుత్వంలో 20 మంది ఉద్యోగులతో రెండు డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు. తర్వాత ఇద్దరు ప్రమాదవశాత్తు మరణించటంతో వారి స్థానంలో పూర్వ కమిషనర్లు వారి కుటుంబ సభ్యులకు కేఎంసీ కార్యాలయంలో ఉద్యోగాలు కల్పించారు. కాగా ఇటీవల కాలంలో డీఆర్ఎఫ్‌లో కనీస నోటిఫికేషన్లు ఇవ్వకుండానే ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయి. ఏ రోజు ఎవరు వచ్చి ఉద్యోగంలో చేరతారో తెలియని పరిస్థితి ఉంది. ఇటీవల కాలంలో హైదరాబాద్ నుంచి ఒక ఉద్యోగి బదిలీపై రాగా స్థానికంగా కార్పొరేటర్లు, నాయకులు సిఫారసుల మేరకు ముగ్గుర్ని నియమించారు. ఆ నియామకాలపై దుమారం లేచింది. ఇంకా అది సద్దుమణగక ముందే సోమవారం కామేపల్లి మండలం ముచ్చర్ల జాస్తిపల్లి గ్రామానికి చెందిన నర్సింహారావు అనే మరో ఉద్యోగి డీఆర్ఎఫ్ బృందంలో చేరారు. దీంతో డీఆర్ఎఫ్‌లో ఉండాల్సిన పరిమిత సంఖ్యకు మించింది. రెండు డీఆర్ఎఫ్ బృందాలకు 20మంది ఉద్యోగులకు మాత్రమే అవకాశం ఉండగా.. ఇప్పటికే 22మంది ఉద్యోగులు డీఆర్ఎఫ్ జాబితాలో చేరారు. కేఎంసీ ఉద్యోగుల వేతన బడ్జెట్‌కు మించిన స్థాయిలో వరసగా ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో భవిష్యత్‌లో ఉద్యోగుల వేతనాలకు ఆర్థికంగా ఇబ్బందులు ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయన్న చర్చ జరుగుతోంది.



అత్యవసర సేవల్లో ఖమ్మం డీఆర్ఎఫ్ బృందం (ఫైల్)

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

- ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు కుచ్చుటోపి
- పలు సందర్భాల్లో రూ.1.62కోట్లు కాజేత



నిందితులతో ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు

ఖమ్మం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్‌లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి రూ.1.62కోట్లకు మోసం చేసిన కేసులో ముగ్గురు నిందితులను ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీపీ సునీల్‌దత్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలివీ.. బోనకల్లు మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో ట్రేడింగ్, ఇన్వెస్టిమెంట్‌లో నగదు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్, ట్రేడింగ్ లింకుల ద్వారా పలు సందర్భాల్లో రూ.1.62కోట్లను కొల్లగొట్టినట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు ఆ నగదు వెళ్లిన అకౌంట్లకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ముందుగా డబ్బు అకౌంట్‌లోకి వెళ్లిన షేక్ సుభానిని అరెస్ట్ చేసి విచారించగా.. దాసరి సునీల్ కుమార్, సుదలగుంట్ల సాయికృష్ణలతో కలిసి నేరం చేసినట్టు అంగీకరించడంతో ముగ్గురిని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో అరెస్ట్ చేసి సైబర్ క్రైం కోర్టులో హాజరుపరిచినట్టు సీపీ తెలిపారు. ఈ సందర్భంగా కేసు విచారణలో ప్రతిభ కనబర్చిన సైబర్ క్రైం డీఎస్పీ ఫణిందర్, ఇన్‌స్పెక్టర్ యాసిన్ అలీ, ఎస్ఐలు రంజిత్ కుమార్, విజయ్‌కుమార్, సిబ్బందిని ఆయన అభినందించారు.

కేంద్ర ప్రభుత్వం నరమేధం సృష్టిస్తోంది

- వారం రోజులుగా నంబాల మృతదేహాన్ని బంధువులకు అప్పగించలేదు
- ప్రత్యర్థి దేశాలతో చేయాల్సిన యుద్ధాన్ని శవాలతో చేస్తున్నారా?
- మావోయిస్టుల అంత్యక్రియలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకు రావాలి
- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 26 (ఆంధ్రజ్యోతి): మధ్య భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం నరమేధం సృష్టిస్తోందని, సరిహద్దుల్లో ప్రత్యర్థి దేశాలతో చేయాల్సిన యుద్ధాలను ఆదివాసీల ప్రాంతాలైన దండకారణ్యాల్లో చేస్తోందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు పోటు రంగారావు ఆరోపించారు. సోమవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 21న అనారోగ్యంతో ఉన్న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావును కేంద్ర బలగాలు పట్టుకొని నుదిటిపై కాల్చి హత్య చేశాయని ఆరోపించారు. ఆయనతో పాటు మరో 26 మందిని పట్టుకొని హత్యలు చేసి.. ప్రజలకు విషయం తెలియకుండా ఉండేందుకు మృతదేహాన్ని బంధువులకు వారం రోజులుగా అప్పగించలేదన్నారు. తెలుగురాష్ట్రాలకు చెందిన వారి మృతదేహాలను వారి స్వగ్రామాలకు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతోందన్నారు. ఆర్ఎస్ఎస్ విధానాలతో బీజేపీ ప్రభుత్వంలో ఫాసిస్టు విధానాలను అమలు చేస్తోందని, దండకారణ్యంలో అందుబాటులో ఉన్న తొమ్మిది రకాల ఖనిజ సంపదపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పడిందని అందుకే ఆదివాసీలను బెదిరించి ఆయా ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇలాంటి నరమేధం సృష్టిస్తోందని ధ్వజమెత్తారు. కుటుంబసభ్యులకు మృతదేహాలను ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా వారి స్వగ్రామాలకు పంపటం లేదన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ప్రజల జీవించే హక్కులను కాపాడాలన్నారు. జిల్లా కమిటీ కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఇతర ప్రజాసంఘాల నాయకులు నంబాల కేశవరావు మృతదేహం వద్దకు వెళ్తుంటే కేంద్ర బలగాలు అడ్డుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, గండమళ్ల రామయ్య, ఝాన్సీ, మలీదు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాలు.. ఆరోగ్యానికి మేలు

- పెరుగుతున్న డబ్బా పాల వాడకం
- పిల్లల్లో క్షీణిస్తున్న ఆరోగ్యం
- అపోహాల్లో మహిళలు

మణుగూరు టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రతినెల మందుల దుకాణాలు సూపర్ మార్కెట్‌లలో కృత్రిమ పాల డబ్బాలు లెక్కకు మిక్కిలి అమ్మకాలు జరుగుతున్నాయి. లేని పోని అపోహలు పడతుల మనసును పాదరసంగా పరుగులెత్తిస్తోంది. అందం తొలగి పోతుందని కొందరు.. అపోహల్లో మరికొందరు... అసలు బిడ్డలకు పాలు పట్టించడం ఎలాగో తెలియని వారు ఇంకొందరు. ఉద్యోగ రీత్యా నిజ జీవితంలో పాలు పట్టించే పరిస్థితులు కరువవుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి.తాతమ్మల, పెద్దల పర్యవేక్షణ లేకపోవడం వెరసి నేటి తరం యువతుల్లో తల్లి పాల ప్రాముఖ్యత కొరవడుతున్నట్టు ఆరోగ్య సంస్థల సర్వేలు తేట తెల్లం చేస్తున్నాయి.

తల్లిపాలు పట్టిస్తే ఎన్నో ఉపయోగాలు

ఎం.శ్రీదేవి, పిల్లల వైద్య నిపుణురాలు



శిశువు జన్మించిన గంటలోపు తల్లి పాలు ముర్రుపాలు పట్టించడం వల్ల బిడ్డకు రోగ నిరోధకత శక్తి పెరుగుతుంది. తల్లి పాలు పిల్లల ఎదుగుదలకు దోహద పడతాయి. చీటికి మాటికి అనారోగ్యాల బారిన పడకుండా ఉండేందుకు తల్లి పాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. పగటి వేళ కంటే రాత్రి వేళల్లో పాలు ఇవ్వడం మంచిది. 1500 గ్రాముల కంటే తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు తల్లి బలహీనత వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యుల సలహా మేరకు డబ్బా పాలు వాడాలి.

భారం అనుకోవద్దు .. బాధ్యతగా భావించాలి

డాక్టర్ అజంత, గైనకాలజిస్టు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి



పుట్టిన పిల్లలకు తల్లి పాలు పట్టించడం భారం అనుకోవద్దు. అది బాధ్యతగా భావించాలి. ఆ బాధ్యతే మానసిక ధైర్యంగా మారాలి. అప్పుడే తల్లి పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం. సహజ సిద్ధంగా వందలో 5 నుంచి 10 శాతం బాలింతల్లో పాలు బిడ్డకు సరిపడా రాకుండా ఉంటాయి. కొంత మందిలో రక్త హీనత వల్ల పాలు రాకపోవడం లాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి. గర్భవతిగా ఉన్నప్పటి నుంచే పోష్టికాహారం తీసుకోవాలి. శిశువు జన్మించిన అనంతరం ప్రొటీన్ డైట్ కొనసాగించాలి. సాధారణ స్థితిలో ఉన్నప్పుడు 1800 నుంచి 2200 కిలో క్యాలరీల ఆహారం కంటే బాలింతగా ఉన్నప్పుడు అదనంగా 550కిలో క్యాలరీల పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. అప్పుడే బిడ్డకు పుష్టిగా పాలు అందుతాయి. ఆరు నెలల వరకు పిల్లలకు తల్లి పాలు పట్టించడం వల్ల చురుకుదనం ఆరోగ్యం, ఎదుగుదల పటిష్టంగా ఉంటుంది.


కౌన్సెలింగ్‌లో ఎంపికైన విద్యార్థికి పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలల్లో కౌన్సెలింగ్

భద్రాచలం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను కౌన్సెలింగ్‌ను సోమవారం భద్రాచలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలలో నిర్వహించారు. మొత్తం 302 సీట్లు ప్రథమ సంవత్సరంలో భర్తీ కోసం ఈ స్పాట్ కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. కళాశాల కన్వీనరు నాగేశ్వరరావు, ఆర్‌సీవో అరుణకుమారి ఆధ్వర్యంలో వివిధ కోర్సులకు 570 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 302 సీట్లను మెరిట్ ఆధారితంగా ఎంపిక చేసి విద్యార్థులు ఎంచుకున్న గ్రూపులను కేటాయించి గురుకులం ఆర్‌సీవో అరుణకుమారి తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ తరగతులు ప్రారంభం


పరికరాలను అందజేస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్

కొత్తగూడెం, మే 26 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం యూనివర్సిటీ ఆఫ్ మైనింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి సర్వే చేయడం కోసం లైసెన్స్ సర్వేయర్లుగా ఎంపికైన 426మంది అభ్యర్థులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని రాణించాలని సూచించారు. ప్రభుత్వం కొత్త భూ రికార్డుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అభ్యర్థులకు మొత్తం 50రోజుల పని రోజుల్లో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణలో భాగంగా అభ్యర్థులను రెండు బ్యాచ్‌లుగా విభజించి ఉదయం థియరీ తరగతులు నిర్వహిస్తారని, మధ్యాహ్నం క్షేత్రస్థాయికి తీసుకు వెళ్లి సర్వేపై శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ తరగతులకు హాజరైన అభ్యర్థుల విద్యా అర్హతకు సంబంధించిన ఒర్జినల్ సర్టిఫికెట్లను ప్రత్యేక కౌంటర్ల ద్వార పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అభ్యర్థులకు సర్వేకు సంబంధించిన గొలుసులు, క్రాస్ స్టాప్, క్యాలిక్యూలేటర్, స్కేల్, పెన్సిల్, నోట్‌బుక్స్‌తోపాటు స్టడి మెటీరియల్‌కు సంబంధించిన కిట్లను అందించారన్నారు. పూర్తైన అనంతరం శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మైనింగ్ కళాశాల ఏడీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాస్, మైనింగ్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు చేదు అనుభవం

- ప్రతికూల వాతావరణంతో తగ్గిన దిగుబడి
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తగ్గిపోతున్న మామిడి విస్తీర్ణం



సత్తుపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మామిడి సీజన్ రైతులకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. గత రెండేళ్ల మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రతికూల వాతావరణం, తెగుళ్ల కారణంగా మామిడి కాపు తగ్గింది. మొదట్లో భారీగా రేటు పలికినా క్రమేపీ ధర పడిపోయి పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు ఎదురయ్యాయని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికేడాది మామిడి కాపు పడిపోవటం, తెగుళ్లు, వాతావరణం అనుకూలించకపోవటం లాంటి కారణాల వల్ల మామిడి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మామిడి సాగుపై రైతుల ఆసక్తి సన్నగిల్లుతోంది. ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు మళ్లుతున్నారు.

43 వేల ఎకరాల్లో మామిడి సాగు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 43వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. గతంలో లక్ష ఎకరాలకుపైగా మామిడి విస్తీర్ణం ఉండేది. గత పదేళ్లుగా మామిడి తగ్గుతూ వస్తోంది. మామిడి విస్తీర్ణాన్ని ఆయిల్‌పాం ఆక్రమిస్తోంది.

గరిష్ఠం నుంచి కనిష్ఠానికి ధర

మామిడి సీజన్‌లో ప్రతి ఏటా మొదట్లో ధర ఆశాజనకంగానే ఉంటూ వస్తోంది. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి ఉంది. రాను రాను ధర పడిపోయి రైతులు నష్టపోయారు. బంగినపల్లి రకం సీజన్ ప్రారంభంలో టన్ను ధర గరిష్ఠంగా రూ.65వేల వరకూ పలికింది. ప్రస్తుతం రూ.20వేలు ఉందని రైతులు చెపుతున్నారు.

ప్రతికూల వాతావరణంతో తగ్గిన దిగుబడి

మామిడి సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ప్రతికూల వాతావరణం కారణంగా దిగుబడి తగ్గిందని రైతులు చెపుతున్నారు. మంచు కారణంగా పూత, దోమ, నల్లి కారణంగా కాయ రాలిపోవటం, ఈదురు గాలులు, భారీ వర్షాల కారణంగా కాయలు నేలమట్టమయ్యాయి. దీంతో రైతులు భారీగా నష్టపోయారు. మొత్తంగా మామిడి సీజన్ రైతులకు నష్టాలను మిగిల్చింది.

ఈసారైనా దక్కేనా?

(5వ పేజీ తరువాయి)

దేవస్థానం పాలకమండలి, ఇతర దేవాలయ కమిటీల పదవులు కూడా ఖాళీగా ఉన్నాయి.

కేడర్‌లో పెరుగుతున్న అసహనం

వాస్తవానికి నామినేటెడ్ పదవులు ఇప్పటికే భర్తీచేసి ఉంటే ఒక విడత పదవీ కాలంలో కొందరు నాయకులకు పదవులు దక్కి మరో విడతలో మరికొందరికి పదవులు లభించి ఉండేవి. ఏడాదిన్నర కాలంగా పదవుల నియామకం లేకపోవడంతో కాంగ్రెస్ కేడర్‌లో నిరాశ, అసహనం పెరిగిపోతోంది. పీసీసీ కార్యవర్గంలో కూడా ఉమ్మడిజిల్లా నుంచి కొందరు నేతలు స్థానం ఆశిస్తున్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శులు, ప్రచార కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులతో పాటు రాష్ట్రస్థాయి సంస్థాగత పదవుల్లో తమవారికి అవకాశాలు ఇవ్వాలని ఇప్పటికే మంత్రులు కొందరి పేర్లను సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

కొవిడ్‌పై అప్రమత్తం

(5వ పేజీ తరువాయి)

అందించే వైద్య చికిత్సకు సంబంధించిన పరికరాలను, మందులు, కిట్ల ఇండెంట్ పంపిణీ చేయాలని అధికారులు ప్రతిపాదించినట్టు తెలుస్తోంది.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పని సరి

డాక్టర్ భాస్కర్‌నాయక్, భద్రాద్రి డీఎంహెచ్‌వో

కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను రక్షణ, సూత్రాలను పాటించాలి. బహిరంగ ప్రదేశాల్లో, ప్రయాణం చేసే సమయాల్లో, మాస్కులు తప్పక ధరించాలి. కరచాలనం చేయడం ఆపేయాలని, నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎవరికైన దగ్గు, జలుబు, జ్వరం, ఇతరత్రా లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. కొవిడ్‌కు భయపడకుండా వైద్య ఆరోగ్యశాఖాధికారులు, సిబ్బంది సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌కు రూ.50వేలు డిమాండ్

(5వ పేజీ తరువాయి)

శ్రీనివాస్ అనే వ్యక్తి.. తన పేరిట ఉన్న 2,700 గజాల స్థలాన్ని తన కుమారుడి పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు చలానా తీసిన అనంతరం రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో సబ్‌రిజిస్ట్రార్ అరుణ వారిని రూ.50వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేసింది. దీంతో శ్రీనివాస్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం దరఖాస్తుదారుడు సబ్‌రిజిస్ట్రార్‌తో బేరమాడి రూ.30వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే ఆ నగదును డాక్యుమెంట్ రైటర్ పుచ్చకాయల వెంకటేష్ ద్వారా తనకు అందజేయాలని ఆమె చెప్పింది. ఈ క్రమంలో సోమవారం రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం డాక్యుమెంట్ రైటర్ ద్వారా నగదు తీసుకుంటుండగా ఇరువురిని ఏసీబీ అధికారులు పట్టుకుని అరెస్ట్ చేశారు. దీనిపై విచారణ జరుగుతున్నట్టు ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమను సంప్రదించాలని సూచించారు. ఏసీబీ టోల్ ఫ్రీ నెం 1064 ద్వారా 9440446106 నెంబర్‌లో కానీ తమను సంప్రదించొచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచడంతోపాటు, చట్టబద్ధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో జరగాల్సిన పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ ఏడాది రోహిణి లేనట్టే..!

- రోళ్లు పగిలే ఎండలు మండిపోతాయి అనుకున్నాం..
- వేసవి కాలంలో కురుస్తున్న వర్షాలు
- చల్లబడిన వాతావరణ..
- వ్యవసాయ సీజన్‌కు అనుకూలం



కొత్తగూడెం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవి కాలం ముగిసిపోయింది. వేసవి కాలంలో ప్రతి ఏడాది మండుతున్న ఎండలను చూశాం.. ఈ ఏడాది మాత్రం వేసవికాలంలో ఎండలు మటుమాయమై వానలకు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మే నెల రోహిణికార్తెలో రోళ్ల పగిలే ఎండలు మండిపోతాయనుకున్నాం... రోహిణికార్తె ప్రారంభం రోజు నుంచి జిల్లాలో వర్షాలే.. వర్షాలు. ఒక్కసారిగా జిల్లా వ్యాప్తంగా వాతావరణం పూర్తిస్థాయిలో చల్లబడింది. వర్షాలు రావడంతో చిన్న చిన్న కుంటలు, చెరువుల్లో వర్షపు నీరు కనిపిస్తోంది. మరో పక్కన నైరుతి రుతుపవనాలు పది రోజులు ముందుగానే వచ్చాయని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. దీంతో వ్యవసాయ సీజన్‌కు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే అడపాదడపా కురిసిన వర్షాల వల్ల రైతులు తమ పంట పొలాలను దుక్కులు దున్ని చేసుకున్నారు. ఈ ఏడాది వ్యవసాయ సీజన్ ముందుగానే వస్తోందని రైతులు వ్యూహించుకుని అయా పంటలకు సంబంధించిన విత్తనాలను సైతం సిద్ధం చేసుకున్నారు. జూన్ మొదటి వారంలోనే విత్తనాలను విత్తేందుకు రైతులు సిద్ధమయ్యారు. మొత్తం మీద వేసవి కాలం ఈ ఏడాది మటుమాయమైంది. ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు ముందస్తుగా ప్రణాళికలను సిద్ధం చేశారు. జిల్లాలో ప్రధానంగా రైతులు ప్రతి ఏడాది పత్తి, మిర్చి, వేరుశనగ, మొక్కజొన్న, ఇతరాత్ర పంటలను అధికంగా పండిస్తుంటారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలను సిద్ధం చేసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టి అందుబాటులోకి తీసుకొచ్చారు.

జిల్లాలో ఈ ఏడాది 40,625 మెట్రిక్ టన్నుల యూరియా, 10,978 మెట్రిక్‌టన్నుల డీఏపీ అవసరం ఉంది. దాని కోసం వ్యవసాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా అందజేశారు. దీంతోపాటుగా ఆయిల్‌పా కోసం మొక్కలు నాటేందుకు ప్రభుత్వం సిద్ధం చేసింది. మునగ విత్తనాలకు ప్రతిపాదనలు పంపించారు. జిల్లాలో ఈ ఏడాది పత్తిపంట 2,04,632 ఎకరాలు, వరి 1,65,956 ఎకరాలు, మొక్కజొన్న 86,544 ఎకరాలు, ఆయిల్‌పాం 75వేల ఎకరాలు, జీడి మామిడి 11,903 ఎకరాలు, మిర్చి పంట 10,489 ఎకరాలు, పెసళ్లు 108 ఎకరాలు, మినుములు 840 ఎకరాలు, కందులు 1130 ఎకరాల్లో ఈ వర్షాకాలం సీజన్‌లో పంటలను సాగుచేసేందుకు ప్రధాన పంటలు సాగించేందుకు వ్యవసాయ అధికారులు సిద్ధంచేశారు.

జిల్లాలో ఈ ఏడాది 6,09,622 ఎకరాల్లో పంటలను సాగు చేసేందుకు వ్యవసాయశాఖాధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గత ఏడాది వర్షాకాలం సీజన్‌లో 5,92,264 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 17,358 ఎకరాల్లో అదనంగా పంటలు సాగు చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే జిల్లాలో 41,489 క్వింటాల వరి విత్తనాలు, 6,924 క్వింటాలు మొక్కజొన్న విత్తనాలు, 51,158 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం ఉందని కూడా ప్రభుత్వానికి వ్యవసాయ అధికారులు ప్రతిపాదనలు చేశారు. జిల్లాలో పలు మండలాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా పచ్చిరొట్టవిత్తనాలను అందుబాటులో ఉంచామని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం మీద వేసవి కాలం మర్చిపోయి ముందుజాగ్రత్తగా వర్షాలు కురవడంతో ఈ వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నాయని చెప్పవచ్చు.


తిరంగా ర్యాలీలో భరతమాతకు సెల్యూట్ చేస్తున్న దృశ్యం

వైరాలో తిరంగా ర్యాలీ

- భారీ సంఖ్యలో పాల్గొన్న జాతీయవాదులు

వైరా, మే 26 (ఆంధ్రజ్యోతి): వైరాలో సోమవారం రాత్రి ఆపరేషన్ సింధూర్‌కు సంఘీభావంగా, భారత సైన్యానికి మద్దతు తెలుపుతూ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రాం జిల్లా కోకన్వీనర్ నరేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత శివాలయం రోడ్డు నుంచి కొత్త బస్టాండ్ వరకు ఈ ర్యాలీ చేశారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మేధావులు, అన్నివర్గాలకు చెందిన జాతీయవాదులు మువ్వన్నెల జెండాలు చేతబూని ర్యాలీని విజయవంతం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, పట్టణ, మండల అధ్యక్షులు మనుబోలు వెంకటకృష్ణ, దోనపాటి కల్యాణ్, జూలూరుపాడ్ మండల అధ్యక్షుడు భూక్యా సురేష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు, మండల అధ్యక్షుడు కిలారు సురేందర్, సీపీఐ నాయకుడు మిట్టపల్లి రాఘవరావు, వివిధ పార్టీల నాయకులు కొవ్వూరి నాగేశ్వరరావు, బండారు భాస్కర్, గ్రంధి లక్ష్మీనర్సయ్య, డాక్టర్ కాపా మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముందస్తు ఏరువాక

- పత్తి సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్న అన్నదాతలు
- ముందస్తు వానలకు పత్తి పంట వేసిన రైతులు
- పొలం పనుల్లో రైతులు బిజీ బిజీ

బోనకల్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ మండలంగా పేరున్న బోనకల్ మండలంలో రైతులు ముందస్తుగానే పొలాలను దుక్కులు దున్నించి సాగుకు సమాయత్తమయ్యారు. ఈ ఏడాది వ్యవసాయ సీజన్‌కు ముందుగానే వానాలు పడుతుండటంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. గత ఏడాది పత్తి సాగు తరువాత రెండో పంటగా మక్క వేసిన రైతులకు కాలం కలిసి రావడంతో అధిక దిగుబడులు సాధించారు. గిట్టుబాటు ధర కూడా ఉండటంతో పెట్టుబడి పోనూ ఎకరానికి రూ. 40 వేల నుంచి 50వేల వరకు ఆదాయం వచ్చిందని రైతులు ఎంతగానో సంతోషించారు. కలిసొచ్చిన మక్క సాగుతో రైతులు ముందుగానే భూములల్లో దుక్కులు వేయించారు. కొంతమంది భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయ పనులను చేస్తున్నారు. ఎరువులు తోలడంతో పాటు దుక్కులు, కూలీలతో చెత్త ఏరించే పనులను పూర్తి చేశారు. వానా కాలం సీజన్ పంటగా పత్తి పంటను సాగు చేసేందుకు విత్తనాలను కొనుగోలు చేసి ఇళ్లకు తెచ్చుకున్నారు.

వేసవి కాలంలోనే వర్షాలు పడుతుండటంతో మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలోని పలువురు రైతులు పత్తి విత్తనాలు వేశారు. నైరుతి రుతుపవనాలు కూడ వస్తున్నాయని, వర్షాలు పడతాయని వాతావరణశాఖ సూచించడంతో మరొకొందరు రైతులు పత్తి విత్తనాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. పత్తి, మక్క పంటల సాగులో అధిక దిగుబడులు సాధించే గ్రామంగా ముష్టికుంట్లకు పేరుండటంతో అక్కడ రైతులు అందరి కంటే ముందుగానే పత్తి విత్తనాలు వేసి సాగుకు శ్రీకారం చుట్టారు. తొలకరి వానలు ముందుగానే పలకరించడంతో రైతులు ఎంతో ఉత్సాహభరితంగా సాగుబాట పట్టారు.


విత్తనాలు వేసేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు


పొలాల్లో పనులు చేస్తున్న కూలీలు



జగ్గారంలో సీతారామ ప్రాజెక్టు భూ సేకరణ కోసం గ్రామసభ నిర్వహించిన అధికారులు

భూములు ఇచ్చేదే లేదు

» గతంలో పరిహారమే చెల్లించలేదు.. మరలా ఇవ్వలేం

» అధికారులకు తేల్చి చెప్పిన గిరిజనులు

దమ్మపేట, మే 26(ఆంధ్రజ్యోతి): 2019లో ఈ ప్రాంతంలో సీతారామ ప్రాజెక్టు కాలువల కోసం 103.07 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారని, అప్పట్లో ఎకరానికి రూ.8లక్షలు చెల్లిస్తామని చెప్పారని, కాని ఇప్పటి వరకు చెల్లించలేదని, ఇపుడు మరలా భూమిని ఎలా సేకరిస్తారు? ఏ విధంగా ఇస్తామంటూ దమ్మపేట మండలం, జగ్గారం రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. సోమవారం దమ్మపేట మండలం, జగ్గారంలో సీతారామ ప్రాజెక్టు కాలువలకోసం 43 ఎకరాల భూ సేకరణ కోసం సబ్‌కలెక్టర్ కార్తీక్, ఇరిగేషన్ డీఈ కృష్ణ, ఇతర అధికారులు, రెవెన్యూ అధికారులు వీరాస్వామి, వెంకటేశ్వరరావు తదితరులు పెసా సభ్యులతో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు భూ సేకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. గతంలో సేకరించిన భూములను రైతుల పట్టాపాస్ పుస్తకాల నుంచి కూడా మినహాయించారని, పరిహారం మాత్రం చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూలూరుపాడు ప్రాంతంలో ఎకరానికి రూ.24లక్షలు చెల్లిస్తున్నారని, తమకు అదే ధరను చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పామాయిల్ వంటి ఉద్యాన పంటలు పండుతున్న ఈ ప్రాంతంలో వరి పంటను పండిస్తే రైతులకు ఏ విధంగా లాభదాయకమో చెప్పాలని రైతులు ప్రశ్నించారు. ఈ విషయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను కోరారు.



వేట బాట

సంప్రదాయబద్ధంగా ఆదివాసీల భూమి పండుగ

» బట్టిగూడెం, తిరుమలకుంట గ్రామాల్లో ఆదివాసీల సందడి

» వడ్లు, విత్తనాలు పెట్టి ప్రత్యేక పూజలు

» డప్పు వాయిద్యాలతో మార్మోగిన గ్రామాలు

» అడవుల్లో వేటకు వెళ్లిన ఆదివాసీ బిడ్డలు

» వ్యవసాయానికి ముందుగా వేడుక జరపడం ఆనవాయితీ

అశ్వారావుపేట/ చర్ల, మే 26(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాలలో వ్యవసాయ పనులను ప్రారంభించడానికి ముందు గిరిజనులు భూమి పండుగను నిర్వహిస్తారు. భూ మాతను చల్లగా చూడాలని, పంటలను బాగా పండించాలని కొలుస్తూ చేసే పండుగే భూమి పండుగ. గిరిజన ప్రాంతాలలో ఈ పండుగను చేసిన తరువాతే వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. ఆదివాసీల సంప్రదాయాలు, అలవాట్లు అన్నీ అడవులతోనే ముడిపడి ఉంటాయి. వాళ్లు ఏపని చెయ్యాలన్నా అడవి దేవతకు మొక్కుతారు. ప్రత్యేక పూజలు చేస్తారు. ఇదే క్రమంలో గ్రామం సల్లగా ఉండాలని, పంటలు బాగా పండాలని మొక్కు బడులు చెల్లించు కుంటారు. గ్రామ సరిహద్దున ఉన్న అడవుల్లో వేటను కొనసాగిస్తారు.

అందులో భాగంగా సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బట్టిగూడెం గ్రామస్థులు, అశ్వారావుపేట మండల పరిధిలోని తిరుమలకుంట కాలనీలో 'భూమి పండుగను' జరుపుకొన్నారు. భూమి పండుగ సందర్భంగా ఆదివాసీలు గ్రామ శివారులో ఉన్న గ్రామ దేవతకు డప్పు వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్లు, ఆకుకూరలు, కూరగాయలకు సంబంధించిన విత్తనాలను అయంలో పెట్టి మొక్కులు చెల్లించారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. కాగా గ్రామం అంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నామని ఆదివాసీలు తెలిపారు.



తిరుమలకుంట కాలనీలో కోడిగుడ్డును బాణాలతో కొడుతున్న గిరిజనులు

పురుషులు, మహిళలు అందరూ కలసి గ్రామ శివారుకి చేరి కోడిగుడ్డును బాణాలతో కొట్టారు. గుడ్డు పగిలిన తరువాత మగవారందరిని అడవిలోకి జంతువుల వేట కోసం పంపుతారు. ఒక్క ఆడవారు మాత్రమే గ్రామంలో ఉంటారు. ఈ సందర్భంగా పురుషులను అడవికి పంపించే సమయంలో ఎవరైన పురుషులు గ్రామంలో కనిపిస్తే నీళ్ల వారిపై పోసి గ్రామ శివారు వరకు తరిమేస్తారు.

గ్రామలోని చిన్నా, పెద్దా కలిసి గ్రామ శివారులో ఉన్న అడవుల్లో వేటను నిర్వహించారు. వాగులు, వంకల్లో కలియ తిరిగారు. వేట అనేది కొన్ని సంవత్సరాల నుంచి సంప్రదాయంగా వస్తున్న ఆచారమని ఆదివాసీలు తెలిపారు. అడవిలో వేట జరిగేంత వరకు ఈ వేట సాగిస్తామని తెలిపారు. కాగా వేటకు వెళ్లిన వారి కోసం అక్కడి ఆదివాసీ కుటుంబీకులు ఎదురు చూడటం విశేషం. మగవారు వేటాడి తిరిగి వచ్చే సమయానికి తెలిసినవాళ్ల నుంచి విరాళాలు సేకరించి వారికి విందు ఏర్పాట్లు చేస్తారు. వేటాడి తెచ్చిన జంతువుతో కూర వండి, కల్లువంటి వాటిని సమకూర్చి సేద తీరేలా చేస్తారు. ఈ విధంగా పండుగ నిర్వహిస్తే భూమాత కరుణించి పంటలు సమృద్ధిగా ఇస్తుందని గిరిజనుల నమ్మకం.



బట్టిగూడెంలో వేటకు సిద్దంగా ఉన్న ఆదివాసీలు

నెత్తురు చిందిన రహదారులు

» ఆరు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి మృతి

చింతకాని/ బోనకల్/ వేంసూరు/ వైరా/ తల్లాడ/ దమ్మపేట, మే 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో వేర్వేరు చోట్ల ఆదివారం పొద్దుపోయాక, సోమవారం జరిగిన ఆరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు వ్యక్తులు మృతి చెందారు. చింతకాని, దమ్మపేట, బోనకల్, వైరా, తల్లాడ మండలాల్లో ఒక్కొక్కరు, వేంసూరు మండలంలో ఇద్దరు కన్నుమూశారు.

లారీ ఢీకొని బైకర్ మృతి

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు షేక్ అఫ్జల్ పాషా(40) మృతిచెందిన ఘటన చింతకాని మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఖమ్మం నగరం రమణగుట్ట విగలాంగుల కాలనీకు చెందిన అఫ్జల్ పాషా సెంట్రింగ్ పనులు నిర్వహిస్తుంటాడు. సోమవారం పందిళ్లపల్లి గ్రామంలో ఓ ఇంటి నిర్మాణ సెంట్రింగ్ పనులు పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో పందిళ్లపల్లి గ్రామ సమీపంలో బోనకల్ నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ బలంగా ఢీకొనడంతో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనానికి తగలడంతో పందిళ్లపల్లి గ్రామానికి చెందిన మేకల నాగేశ్వరరావుకు తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంజేపీ పీఈటీ మృతి

బోనకల్ మండలంలోని మోటమర్రి గ్రామానికి చెందిన వత్సవాయి నరేష్(26) చింతకాని మండలం నాగులవంచ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. బోనకల్ మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ పీఈటీగా పని చేస్తున్నాడు. ఖమ్మం నుంచి తన స్వ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వచ్చే క్రమంలో మార్గ మధ్యలో గేదేలు అడ్డు రావడంతో కింద పడ్డాడు. అక్కడిక్కడే మృతి చెందాడు.





బోనకల్, తల్లాడ, దమ్మపేట మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన నరేష్, సుధాకృష్ణయ్య, చంటి

ట్రాక్టర్‌ను ఢీకొని...

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన సంఘటన వేంసూరు మండలం జయలక్ష్మీపురంలో ఆదివారం చోటుచేసుకుంది. జయలక్ష్మీపురం గ్రామానికి చెందిన నకిరికంటి నాగరాజు(38), బొల్లేపోగు కృష్ణకుమార్(12) ద్విచక్రవాహనంపై కొండేగట్ల గ్రామానికి వస్తుండగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందగా, కృష్ణకుమార్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం హైదరాబాద్ తరలిస్తుండగా మృతిచెందాడు.

వాహనం ఢీకొని మహిళ మృతి

వైరాలో కూరగాయలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఎదురుగా జాతీయ ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. వైరా మునిసిపాలిటీ నాల్గో వార్డులోని ద్వారకానగర్‌కు చెందిన పదిమల లక్ష్మి(53) ఈ ప్రమాదంలో మృతిచెందింది. ద్వారకానగర్‌లోని తమ ఇంటి నుంచి లక్ష్మి కూరగాయల కోసం మునిసిపల్ కార్యాలయం పక్కనున్న కూరగాయల మార్కెట్‌కు వెళ్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఎదురుగా జాతీయ ప్రధాన రహదారిపై డివైడర్‌ను దాటుతుండగా ఖమ్మం నుంచి తల్లాడ వైపు వెళ్తున్న టాటాఏస్ వాహనం వేగంగా ఢీకొట్టింది. దాంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన సుధా కృష్ణయ్య (53) చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెదాడు. 24వతేదీ అర్ధరాత్రి తల్లాడ మండలం లక్ష్మినగర్ వద్ద తల్లాడ-కుంట జాతీయరహదారిపై అడ్డువచ్చిన గేదెలను తప్పించబోయి అదుపుతప్పి బైక్ పైనుంచి కింద పడి సుధా కృష్ణయ్య తలకు తీవ్రగాయమైంది. అపస్మారకస్థితిలో ఉన్న కృష్ణయ్యను 108 ద్వారా ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండంతో మెరుగైన వైద్య కోసం అక్కడినుంచి సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కృష్ణయ్యకు భార్య కుమార్తె, కుమారుడున్నారు

రహదారిపై గేదేలను ఢీకొట్టి ..

ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి గేదెలను ఢీకొట్టి కిందపడిపోయి మృతి చెందిన ఘటన దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామ సమీపంలో దిబ్బగూడెం వద్ద సోమవారం రాత్రి జరిగింది. సత్తుపల్లి మండలం రెగళ్లపాడు గ్రామానికి చెందిన కూరం చంటి (36) గండుగులపల్లి గ్రామంవైపు ద్విచక్రవాహనంపై సోమవారం రాత్రి వెళుతున్నాడు. రోడ్డుపై ఉన్న గేదెలను ఢీకొట్టి కింద పడటంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. స్థానికులు సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు.

టేకు చెట్ల నరికివేత

దుమ్ముగూడెం, మే 26 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం అటవీరేంజ్ పరిధిలోని పర్ణశాల దక్షిణ విభాగం గడ్డోరుగట్ట రిజర్వ్‌ఫారెస్టు సమీపంలో నరికి ఉన్న మూడు టేకు చెట్లను ఎఫ్ఎస్‌వో నందానాయక్ సోమవారం గుర్తించారు. వీటిలో ఒక చెట్టు మాయమవగా, రెండు చెట్లు సంఘటనా స్థలంలోనే పడి ఉన్నాయి. మాయమైన చెట్టు ఎక్కడుందో విచారణ జరపడంతోపాటు మిగిలిన రెండు చెట్లను డిపోకు తరలిస్తామని ఎఫ్ఎస్‌వో తెలిపారు. ఇద్దరు ఫారెస్ట్ ప్రొటెక్షన్ వాచర్లు ఈనెల 25న సాయంత్రం ఆరు గంటలకు గొడ్డలితో టేకు చెట్లను నరుకుతుండగా, పట్టుకోడానికి ప్రయత్నిస్తే దొరక్కుండా పారిపోయారని గడ్డోరుగట్ట పోడుసాగుదారులు సీఐకు ఆదివారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

నేషనల్ హైవేపై కారు పల్టీ

వైరా, మే 26 (ఆంధ్రజ్యోతి): వైరాలోని పాత బస్టాండ్ సెంటర్లో జాతీయ ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం ఒక కారు పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏపీకి చెందిన ఇద్దరు వ్యక్తులకు స్వల్పగాలయ్యాయి. పాత బస్టాండ్ సెంటర్లో జాతీయ ప్రధాన రహదారిలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టింది. ఏపీలోని కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం ఆర్బీ కొత్తూరు గ్రామానికి చెందిన మన్యంక సత్యనారాయణ, దేవప్రసాద్‌కు స్వల్పగాయాలయ్యాయి.

వీరిద్దరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగింది. స్వల్పగాయాలతో బయటపడటంతో పెనుప్రమాదం తప్పింది. గాయపడిన వారిని పోలీసులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

దశాబ్దాల కాలం నాటి అనుబంధం వీడుతోంది

» రేపటి నుంచి రామాలయ పరిసరాల్లోని ఇళ్ల కూల్చివేతలు



భద్రాచలంలో ఇళ్లను ఖాళీ చేసిన దృశ్యం

భద్రాచలం, మే 26(ఆంధ్రజ్యోతి): ఆ ప్రాంతంతో దశాబ్దాల కాలం నాటి అనుబంధం వారికి ఉంది. తాతలు, ముత్తాతల నాటి నుంచి అదే ప్రాంతంలో నివసిస్తున్న వారు నేడు భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రభుత్వం భూ సేకరణకు సిద్ధం కావడంతో వారి ఇళ్లను తొలగించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఇప్పటికే అక్కడ నివసిస్తున్న కుటుంబాలకు నష్టపరిహారం చెల్లింపులు పూర్తయ్యాయి. ఇంకా ఎనిమిది మంది ఇంటి యజమానులు పరిహారం తీసుకోవాల్సి ఉందని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే పరిహారం తీసుకున్న యజమానులు రాజవీధి పరిసరాల్లోనే తమ నివాసం కోసం తాత్కాలికంగా అద్దెకు ఇళ్లను తీసుకొని అక్కడికి తమ సామగ్రిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో దశాబ్దాల కాలంగా ఆ ప్రాంతంతో తమకున్న అనుబంధాన్ని నెమరవేసుకుంటున్నారు. భూ సేకరణ చట్టంలో భాగంగా ఇంటి యజమానులకు ప్రత్యామ్నాయంగా ఆర్అండ్‌బీ స్థలంలో 90 చదరపు గజాలు కేటాయించనున్నట్లు రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

వేగంగా ఇళ్ల ఖాళీలు

రామాలయ పరిసరాల్లో అభివృద్ధి పనుల భూ సేకరణ కోసం నష్టపరిహారం అందుకున్న నిర్వాసితులు తమ ఇళ్లను ఖాళీ చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం ఇళ్లను నిర్వాసితులు ఖాళీ చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం అధిక శాతం మంది తమ ఇళ్లను ఖాళీ చేయడంతో పాటు ఇంట్లో ఉన్న సామాన్లు, విద్యుత్ పరికరాలు, గుమ్మాలు, కిటికీలు తదితర వాటిని స్వయంగా తొలగింపజేస్తున్నారు. ఇప్పటికే చప్టా దిగువ ప్రాంతంలోని విస్తా కాంప్లెక్సు పక్కన ఉన్న వ్యాపారాలు చేసుకునే వారు తమ ఇళ్లను ఇప్పటికే ఖాళీ చేశారు. వ్యాపారులు సైతం తమ దుకాణాల్లోని సామగ్రిని మరో చోటకి తరలిస్తున్నారు. దీంతో ఇంతకాలం సందడి ఉన్న దుకాణ సముదాయాలు వెలవెలబోతున్నాయి. బుధవారం నుంచి భూ సేకరణ చట్టం కింద నష్టపరిహారం తీసుకున్న ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేసే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పామాయిల్ కూలీ మృతి

దమ్మపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పామాయిల్ కూలీ మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం రంగువారిగూడెగ్రామంలో జరిగింది. ఈఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగువారిగూడెం గ్రామానికి చెందిన ఒక రైతు పామాయిల్ తోటలో మెద్దులగూడెం గ్రామానికి చెందిన తంగెళ్లమూడి పోలయ్య(40) పామాయిల్‌గెలల కోతకు కోసే కూలీపనులకు వెళ్లాడు. సాయంత్రం సమయంలో కోతపూర్తి చేసుకోని తోటలోని పామాయిల్ గెడను తీసే క్రమంలో కరెంటు తీగలకు గెడ తగలటం విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి సోమవారం సాయంత్రం దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

టీడీపీ గువ్వలగూడెం గ్రామశాఖ అధ్యక్షుడిపై దాడికి యత్నం

» పోలీసులకు ఫిర్యాదు

నేలకొండపల్లి, మే26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గువ్వలగూడెం గ్రామ టీడీపీ శాఖ అధ్యక్షుడిపై సోమవారం గ్రామంలోని పార్టీ కార్యాలయం వద్దనే దాడికి ఓవ్యక్తి ప్రయత్నించాడు. గ్రామశాఖ అధ్యక్షుడు కోలేటి మస్తాన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. టీడీపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న తెలుగుదేశం కార్యాలయం కబ్జాకు గురైందన్న ఆరోపణలపై గ్రామానికే చెందిన రావెళ్ల జానకిరామయ్యపై ఈనెల7న నేలకొండపల్లి పోలీసులు కేసును నమోదు చేశారు. కేసును నమోదు చేసిన అనంతరం పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈనేపథ్యంలో నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ కార్యాలయం నిర్మాణం కోసం స్థలాన్ని అమ్మిన వంగూరి వీరస్వామి భార్య రమణమ్మ, కుమారుడు ప్రసాద్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఐ వెళ్లిన అనంతరం కానిస్టేబుల్ పూర్తి వివరాలు నమోదు చేసుకునే సమయంలో గ్రామానికే చెందిన కొత్తపల్లి ఏసు అనే వ్యక్తి పోలీసులు విచారణ జరుపుతున్న స్థలం వద్దకు వచ్చి మస్తాన్‌రావుతో వాగ్వాదానికి దిగాడు. పోలీసుల ఆదేశాలతో వీడియో తీస్తున్న మస్తాన్‌రావు చేతిలో నుంచి మెబైల్ లాక్కుని, కర్రతో మస్తాన్‌రావు పైకి దూసుకెళ్లాడు. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సైదులు పోలీసుల విధులకు అడ్డం రావద్దని వెళ్లిపోవాలని కోరినప్పటికీ గందరగోళం చేయటానికి ప్రయత్నించాడు. చివరకు అక్కడున్న వారందరూ కలిసి ఏసును అక్కడి నుంచి పంపించారు. ఈమేరకు కోలేటి మస్తాన్‌రావు నేలకొండపల్లి పోలీసులకు సోమవారం ఉదయం ఫిర్యాదు చేయగా, కేసును నమోదు చేసినట్లు సమాచారం.

విద్యుత్ దీపాలు దగ్ధం

కల్లూరు, మే26 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో ప్రధాన వీధుల్లో గల విద్యుత్ లైన్లపై జరిగిన షార్టు సర్క్యూట్‌తో గ్రామ పంచాయతీ పరిధిలో గల 55 వీధి దీపాలు దగ్ధమయ్యాయి. వీటి విలువ సూమారు రూ.1.10 లక్షలు ఉంటుంది. ఆదివారం కల్లూరు పట్టణంలో గల కప్పలబంధం, విజ్ఞాన్ పాఠశాల గల వీధుల్లోని 11కేవీ లైన్, జీపీ స్ట్రీట్ లైన్లపై ఓ పక్షి వాలటంతో విద్యుత్ షార్టు సర్క్యూట్ సంభవించింది. దీంతో ప్రధాన వీధుల్లో గల 55 విద్యుత్ స్తంబాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు దగ్ధం కాగా, రాత్రి పూట ఆయా వీధుల్లో గల ప్రజలు అంధకారంలో ఉన్నారు. సత్వరమే గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి ఆయా వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణ తొలి ఉద్యమకారుడు యాకూబ్‌ఖాన్ కన్నుమూత



కల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ తొలి ఉద్యమకారుడైన మహమ్మద్ యాకూబ్‌ఖాన్ (79) సోమవారం తెల్లవారు జామున అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందారు. యాకూబ్‌ఖాన్ 1969 సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుండగా విద్యార్థి సంఘ నాయకుడి హోదాలో నాడు ఆంధ్ర సరిహద్దున గల కల్లూరు ప్రాంతం నుంచి తెలంగాణ ఉద్యమానికి కీలక పాత్ర వహించారు. కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, పసుమర్తి చందర్‌రావు, లక్కినేని రఘు యాకూబ్‌ఖాన్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

గుండెపోటుతో మహిళ మృతి

తల్లాడ, మే26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామంలో గుండెపోటుతో దాసరి శోభారాణి(47) ఆదివారం రాత్రి మృతిచెందింది. శోభారాణి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. సోమవారం ఆమె అంత్యక్రియలు నిర్వహిచారు. ఆమె మృతదేహాన్ని జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్కినేని రఘు, నంబూరి కనకదుర్గ, సొసైటీ చైర్మన్లు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దిరిశాల నరసింహారావు, మాజీ చైర్మన్లు దగ్గుల రఘుపతిరెడ్డి, దుండేటి వీరారెడ్డి, కాంగ్రెస్ కమిటీ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, బీఆర్ఎస్, సీపీఎం మండల అధ్యక్షుడు దుగ్గిదేవర వెంకట్‌లాల్, అయినాల రామలింగేశ్వరరావు, జర్నలిస్టుల సంఘాల నాయకులు పారుపల్లి కృష్ణారావు, ఎం.పాపారావు, కొత్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిపై కేంద్రం నజర్

» చంద్రుగొండలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల పర్యటన

కొత్తగూడెం/చంద్రుగొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రాకేష్‌కుమార్, అమిత్‌కుమార్ చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటంచారు. నాలుగు రోజులు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం బృందం సభ్యులు కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను మర్యాపూర్వకంగా కలిశారు. కలెక్టర్ జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను బృంద సభ్యులకు వివరించారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జలశక్తి కేంద్రంను బృందం సభ్యులు పరిశీలించారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో సమావేశమై జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రుగొండ మండలం తిప్పనపల్లి, రావికంపాడు గ్రామాల్లో బృంద సభ్యులు విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా తిప్పనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి ఉపాధిహామీ పథకం, వేతనదారులు, స్వయం సహాయక సంఘ మహిళలు, ఎన్ఎస్ఎపీ పన్షనర్లతో మాట్లాడారు. స్వయం సహాయ సంఘాల మహిళలకు ఇంట్లో పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఏర్పాటు చేసిన ఊరగాయ తయారీ యూనిట్లను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీ, అవెన్యూ తోటలు, ప్రాథమిక పాఠశాలలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన కిషన్ షెడ్ పనులను, పౌల్ట్రీ షెడ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రావికంపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీపథకం కింద మునగ తోటల పెంపకం, పశువుల షశ్రీడ్, బృహత్ పల్లెప్రకృతి వనాలు, నర్సరీ, తోటల పెంపకంను పరిశీలించారు.

కేంద్ర అధికారులు బృందానికి పలు వర్గాల మహిళలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఉపాధి పనుల వేతనాలు సక్రంగా అందటంలేదని, పనిచేసే ప్రదేశంలో కనీస వసతులు తాగునీరు, టెంట్లు, మందుల కిట్లు ఏర్పాటు చేయటంలేదని, పిల్లలకు పాలు ఇచ్చే వసతి కూడ ఏర్పాటు చేయటంలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు.

సైకిల్‌యాత్రను జయప్రదం చేయండి: డీవైఎఫ్ఐ

తల్లాడ, మే26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి నిర్వహించే యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు సత్తెనపల్లి నరేష్ కోరారు. సోమవారం తల్లాడలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏరులై పారుతున్న మద్యం, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. యువతలో చైతన్యం తెచ్చేందుకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సైకిల్ యాత్ర12 రోజుల పాటు జిల్లాలోని 136 గ్రామాల్లో జరుగుతుందని తెలిపారు. సైకిల్‌లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

» స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా పెండిగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, డీఆర్డీవో ఎన్. సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

- ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన బి. సీతమ్మ, షేక్ రజియా సుల్తానా, ఎం.సావిత్రి తమకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల రెండవ జాబితాలోకి వెళ్లినట్లు పంచాయతీ కార్యదర్శి చెబుతున్నారని, తమకు ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశలోనే ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.

- వేంసూరు మండలం కుంచుపర్తి గ్రామానికి చెందిన కర్లిదుర్గ తాను పూరి గుడిసెలో ఉంటున్నానని, తనకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని కోరింది.

- బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామానికి చెందిన పి. రాంబాబు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులలో స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన పనితీరుపై, విచారణ చేయాలని కోరుతూ దరఖాస్తు చేశాడు.

- తల్లాడ మండలం బాలప్పేట గ్రామానికి చెందిన జి. వీరయ్య తాను 2008 నుంచి బాలప్పేట గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద సీనియర్ మేట్ గా పని చేస్తున్నానని, తనకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉపాధి కల్పించాలని కొరుతూ దరఖాస్తు చేసుకున్నాడు.

కదులుతున్న డొంక!

» నగరంలో దొంగ ఇంటి నెంబర్ల గుర్తింపునకు జల్లెడ
» బిల్ కలెక్టర్ల ఆమోదం లేకుండానే 350ఇళ్లకు సంఖ్య కేటాయింపు
» జీవో 58, 59లో ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు రెవెన్యూ సహకారం
» వార్డు ఆఫీసర్లతో తనిఖీలు చేపట్టిన కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మం సంక్షేమ విభాగం, మే 26 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన దొంగ ఇళ్ల నెంబర్ల కేటాయింపు డొంక క్రమంగా కదులుతోంది. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ముగ్గురు కమిషనర్లును ఏమార్చి అడ్డగోలుగా రెవెన్యూ అనుమతులు జారీ చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై కమిషనర్ అభిషేక్ అగస్త్య పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్లు రిజెక్ట్ చేసిన ఇంటి నెంబర్లను కూడా నిబంధనలను అతిక్రమించి తామే అన్ని అంటూ నెంబర్లు కేటాయించిన ఇద్దరు ఉద్యోగులను ఆయన ఇంటికి పంపారు. అంతేకాదు నగరంలో దొంగ ఇంటి నెంబర్లను గుర్తించేందుకు జల్లెడ పడుతున్నారు. ఇందుకోసం వార్డు ఆఫీసర్లతో విచారణ ప్రారంభించారు.

బిల్ కలెక్టర్ అనుమతి లేకుండానే...

గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 58, జీవో 59 అమల్లోకి తీసుకొచ్చింది. వాటిలో ఇంటి నెంబర్ ఉన్న స్థలాలకు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. ఇక్కడే ఖమ్మం నగర పాలక సంస్థలో రెవెన్యూ విభాగంలో అవినీతి బీజాలు పడ్డాయి. జీవో నెంబర్ 58, 59లో ప్రభుత్వ స్థలాలు పొందేందుకు దళారుల ద్వారా ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఓ ముఠా ఏర్పడింది. ఇదే క్రమంలో గత ప్రభుత్వంలో ఇంటి నెంబర్ల కేటాయింపునకు ఇంటి యజమానులే కొలతలు సేకరించేలా సెల్ఫ్ ఎసెస్‌మెంట్ విధానం అమల్లోకి తెచ్చింది. నిర్ణీత సమయంలో ఇంటి నెంబర్ కేటాయించకపోతే డీమ్డ్ విధానంలో అవకాశం కల్పించింది. దీంతో బిల్ కలెక్టర్ల అనుమతి లేకుండానే కొందరు కంప్యూటర్ ఆపరేటర్లు అవినీతికి పాల్పడ్డారు. ఖమ్మం నగరంలో బిల్ కలెక్టర్లు అనుమతి లేకుండానే 350కు పైగా ఇంటి నెంబర్లు కేటాయించారు. అయితే ఇటీవల బయటపడిన రెవెన్యూ అవినీతిపై కఠినంగా నిర్ణయాలు తీసుకుంటున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య 350ఇంటి నెంబర్లుపై తనిఖీలు చేయాలని, వార్డు ఆఫీసర్లుకు ప్రాంతాల వారీగా విచారణ బాధ్యతలను అప్పగించారు. దీంతో వార్డు ఆఫీసర్లు దొంగ ఇంటి నెంబర్లపై పరిశీలన ప్రారంభించారు. ఈ క్రమంలో సుమారుగా 100కు పైగా దొంగ ఇంటి నెంబర్లు (ఖాళీ స్థలాలకు ఇచ్చినవి) బయటపడే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఏదేమైనా ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య చేపట్టిన రెవెన్యూ విచారణలో అవినీతి ఉద్యోగుల్లో అలజడి మొదలైంది.

నెంబర్ల కేటాయింపులో బిల్ కలెక్టర్లు కీలకం..

ఒక ఇంటికి నెంబర్ కేటాయించాలంటే తొలుత ఆ ఇంటి కొలతలను బిల్ కలెక్టర్ పరిశీలించి ఆ కొలతలను నిర్ధారించాలి. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే అది నేరుగా కమిషనర్‌కు వెళుతుంది. కమిషనర్ తొలి పరిశీలన తర్వాత ఆన్‌లైన్‌లో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌కు ఫార్వర్డ్ అవుతుంది. మరోసారి క్షేత్రస్థాయిలో బిల్ కలెక్టర్‌తో కలిసి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఇంటి కొలతలు, ఇంటి స్థలం తనిఖీలు చేస్తారు. అమోదయోగ్యంగా ఉంటేనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆన్‌లైన్‌లో రెవెన్యూ ఆఫీసర్‌కు పంపుతారు. బిల్ కలెక్టర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఇచ్చిన నివేదికల మేరకు రెవెన్యూ ఆఫీసర్ సంతృప్తి చెందితే కమిషనర్‌కు ఆన్‌లైన్‌లో వెళ్తుంది. మూడు దశల్లో పరిశీలన పూర్తయి.. అది మళ్లీ కమిషనర్‌కు వెళుతుంది. అక్కడ దరఖాస్తు నిబంధనల మేరకు ఉంటే ఓకే చేస్తారు.. లేదంటే రిజెక్ట్ చేస్తారు. కమిషనర్‌దే తుది నిర్ణయం. ఈ క్రమంలో బిల్ కలెక్టర్ నివేదికలు కీలకంగా ఉంటాయి.

బాలికల రక్షణ అందరి బాధ్యత

» జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ



మాట్లాడుతున్న డీఈవో సత్యనారాయణ

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 26(ఆంధ్రజ్యోతి): బాలికలు, పిల్లల, మహిళల రక్షణలో ప్రజలు అందరూ భాగస్వామ్యం అయినప్పుడే అక్రమ రవాణా సమూలంగా నివారించవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి కె. సత్యనారాయణ అన్నారు. సోమవారం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆడపిల్ల అక్రమ రవాణా, డ్రగ్స్ అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ, ఎంతమంది జీవితాలను నాశనం చేస్తుందన్నారు. దీనిపై ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అజిత, భద్రాద్రి కొత్తగుడెం జీసీడీవో అన్నమణి. ప్రజ్వల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ప్యానల్ న్యాయవాదిగా వెక్కిరాల



ఖమ్మం లీగల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది వెక్కిరాల రాంబాబును యూ నియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్యానల్ అడ్వకేట్‌గా నియమిస్తూ చీఫ్ మేనేజర్ కె.నర్సింహ రావు ఉత్తర్వులు జారీచేశారు. తన నియామకం పట్ల ఆయన డిప్యూటీ రీజనల్ హెడ్ టి.సర్వేష్, డీజీఎం హనుమంతరెడ్డి, ఏజీఎం ఎన్. సుధాకర్, లీగల్ ఆఫీసర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాంబాబు నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రీజియన్‌లోని టీజీఎస్ ఆర్టీసీ డిపోలలో ఐటీఐ డిజిల్ మెకానిక్ ట్రేడ్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ మేనేజర్ సరిరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూన్ 10లోగా దరఖాస్తులు అందించాలని తెలిపారు.

బెల్లి లలిత, మారోజు వీరన్న వర్ధంతి



బెల్లి లలిత, మారోజు వీరన్న చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మంచర్చికాంపౌండ్, మే26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గానకోకిల, జనసభ నాయకురాలు బెల్లి లలితక్క, తెలంగాణ కోసం పోరాడిన మారోజు వీరన్న వర్ధంతిని వీరనారీమణుల ఆశయసాధనన సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. లలితక్క, వీరన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రాబాయి మాట్లాడుతూ తెలంగాణ మలి దశ ఉద్యమానికి ఊపిరిపోసిన బహుజననాయకురాలు లలితక్క అని కొనియాడారు. ఈకార్యక్రమంలో బహుజన సంఘం జేఏసీ నాయకులు బానోత్ బద్రునాయక్, సంజీవరావు, నాగేశ్వరరావు రవీందర్, వీరేంద్రనాయక్, జ్యోతి, ప్రవీణ్, ఝాన్సీ తదితరులున్నారు.

కార్పొరేషన్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదుల వెల్లువ

» స్వీకరించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు అందించి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని కేఎం సీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్ర జల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సుమా రు రెండు గంటల పాటు ఓపిగ్గా ప్రజావాణిలో కూర్చొని ప్రతి వినతిని సంబంధిత అధికారులతో ఫిర్యాదుదారుల ఎదుటనే వివరణ తీసుకున్నారు. పలు ఆదేశాలు వెంటనే ఇచ్చారు. కొన్ని వినతులపై విచారణకు అసిస్టెంట్ కమిషనర్ ఆహ్మద్ షఫీ ఉల్లాను ఆదేశించా రు. కంప్యూటర్ అపరేటర్లు వద్దకు వెళ్లి ప్రజావాణి ఫిర్యాదుల ఆన్‌లైన్ నమోదును తనిఖీ చేశారు. 17వ డివిజన్‌లో రహదారుల మీదకు వృక్షాలు వచ్చి రవాణా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఫిర్యాదులు చేశారు. స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకోవాలని పారిశుధ్య పర్యవేక్షకులను ఆదేశించారు. ఒకసారి ఒక సమస్యపై వచ్చిన ఫిర్యాదుదారుడు మరోసారి రాకుండానే పరిష్కరించాలని, ఒకే ఫిర్యాదు పునరావృతం కాకుండా వారం రోజు లు లోపుగానే పరిష్కరించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్‌కు ఫిర్యాదులు అధికంగా రావడం తో పరిష్కరించాలని సుడా డీసీపీని ఆదేశించారు. కాగా సాధారణ ఫిర్యాదులతో పాటుగా మరో 30 వరకు ప్రత్యేకమైన ఫిర్యాదులను ప్రజలు అందించారు. ఏఎంసీ ఆహ్మద్‌షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్, ఏవో కే. శివలింగం, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

ఖమ్మం కలెక్టరేట్, మే 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 28న మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటీఐ, టేకులపల్లి) ఖమ్మంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో సెంటర్ మేనేజర్/ఈఆర్వో/ఎల్‌పీవోలో 20 ఖాళీల ఉద్యోగాలకు, జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్న పురుష అభ్యర్థులు, శ్రీరామ్ చిట్స్ అండ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ 50 ఖాళీల ఉద్యోగాలకు 20 నుంచి 35 సంవత్సరాల వయస్సు, డిగ్రీ అర్హత ఉన్న పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. మొత్తం 70 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

అధిక దిగుబడులు వచ్చేలా సాగుచేయాలి



పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న చైర్మన్ వేణు

తిరుమలాయపాలెం, మే26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులు పంటల సాగులో అధిక దిగుబడుల వచ్చే విత్తనాలు సాగుచేయాలని తిరుమలాయపాలెం సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు తెలిపారు. సోమవారం తిరుమలాయపాలెం సొసైటీ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై అందిస్తున్న జీలుగులు, జనుములు, పచ్చిరొట్ట విత్తనాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచడంతో భూసారం కాపాడుకోవచ్చన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు వేస్తే భూమిలో కార్బన్‌శాతం పెరిగి సూక్ష్మజీవులతో భూమి గుల్లబారి సారవంతమవుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, ఏఈవో బాలకృష్ణ, నవనీత, ఆసియా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని వినతి

తిరుమలాయపాలెం, మే26(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని గ్రామస్థులు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణిలో ఇళ్లస్థలాలకు సంబంధించి పట్టాలు ఇచ్చారు కాని, భూమి చూపించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందించారు. 130మంది లబ్ధి దారులకు పట్టాలు ఇచ్చారని ఇంతవరకు వారి భూమి చూపలేదని, ఇందిరమ్మ ఇండ్లు వస్తే కట్టుకోవాలని ఎదురుచూస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, కొమ్ము నాగేశ్వరరావు, నాగార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న దశ్యం

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

» యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

ఖమ్మం ఖానాపురంమవేలి, మే 26(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కోసం యుటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార జాతాను జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షుతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం ఉంటాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను ఉచితంగా పొందాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, మధ్యాహ్నభోజనం, పాఠ్యపుస్తకాలు, రాగి జావ, ఇంగ్లీష్ మీడియం అందించడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రచార జాతర పది రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించాలని కోరారు. అందుకు ఉపాధ్యాయులు సహకరించాలని అన్నారు. ఈ ర్యాలీ నగరంలోని వైరా రోడ్డు, పాత బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్ తదితర ప్రాంతాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రంజాన్, నాగేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, వీరబాబు, పద్మ తదితరులు పాల్గొన్నారు.



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి

వైరా, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి పాలకమండలిని ఏర్పాటుచేసి అవసరమైన మేరకు నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం వైరాలో మచ్చా మణి అధ్యక్షతన సీపీఎం డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. నున్నా మాట్లాడుతూ 20నెలలుగా గ్రామాలు, మండలాల్లో పాలకవర్గాలు లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు అందక సమస్యలు పేరుకుపోయాయని వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సకాలంలో సీతారామ ప్రాజెక్టును పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా, డివిజన్ నాయకులు సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, దుగ్గి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, దొంతబోయిన నాగేశ్వరరావు, తోట నాగేశ్వరరావు, కె.నరేంద్ర, చెరుకుమల్లి కుటుంబరావు, అంబడి శ్రీనివాసరెడ్డి, వజ్జా రామారావు, బాణోతు బాలాజీ, బాదావత్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు రేషన్ డీలర్ల వినతి



వినతి పత్రం అందిస్తున్న రేషన్ డీలర్లు

ఖమ్మం కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు వెంకన్న, షేక్ జానిమియాలు కోరారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి ప్రతం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలకు సరఫరా చేసి బఫర్ గోదాంలో జూనియర్ అసిస్టెంట్లను పెట్టి బియ్యం స్టేజి వన్‌కి వేయాలని కోరారు. ఎమ్మెల్యేస్ పాయింట్ నుంచి వచ్చే బియ్యం రెండు నుంచి మూడు విడుదలగా రేషన్ షాపులకు సరఫరా చేయాలని కోరారు. కార్డుదారులకు రేషన్ షాపు నుంచి బియ్యం ఇచ్చేటప్పుడు బ్లూటూత్ కాటాను తొలగిచాలని దీని వలన పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వివరించారు. గోదాము నుంచి డీలర్ తంబు వేసేవిధానాన్ని తాత్కాలికంగా తొలగించాలని కోరారు. గతంలో లాగా పోర్టబులిటి విధానాన్ని కొనసాగించాలని, ఈపాస్ మిషన్లో మూడు నెలల బియ్యం కార్డు దారులకు ఒకే సారి ఇచ్చే విధంగా సవరణ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొండా దుర్గయ్య, నగర ప్రధాన కార్యదర్శి శేషగిరిరావు, నగర ఉపాధ్యక్షుడు వట్నాల బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ పైలట్ డే



పైలట్ డే వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పైలట్ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో వేడుకలను నిర్వహించారు. 108 జిల్లా కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, జిల్లా సమన్వయ కర్త దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పైలట్ డే దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం అత్యవసర సమయంలో విశిష్ట సేవలు అందించిన పలువురు పైలట్‌లను అభినందించారు. రెండు దశాబ్దాలుగా విధులు నిర్వర్తిస్తున్న పైలట్‌లను సన్మానించారు. ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ పైలట్స్ 24 గంటలు అందుబాటులో ఉండి క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లో హాస్పిటల్‌కి తీసుకెళ్లడంలో ప్రధాన భూమిక పోషించాలని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో , ఖమ్మం జిల్లా 108, 102, 1962 పైలట్స్, ఈఎంటీలు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రఘునాథపాలెం, మే 26(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలంలోని చిమ్మపూడి గ్రామంలో 2004లో పదో తరగతి విద్యాభ్యాసం పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఆట పాటలతో సందండి చేశారు. ఎవ్వరెవ్వరు ఏం పనిచేస్తున్నారో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



రేపు ముదిగొండ మండలంలో ఉపముఖ్యమంత్రి భట్టి పర్యటన

ముదిగొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీన ముదిగొండ మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు తెలిపారు. ఎడవల్లిలోని యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైరాకు మహర్దశేనా!

- రూ.100కోట్ల నిధులకు ఇక మోక్షం
- అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఐటీఐ కళాశాల
- డిప్యూటీ సీఎం భట్టి మదిలో అభివృద్ధి ప్రణాళికలు

వైరా, మే 25 (ఆంధ్రజ్యోతి): వైరాకు మహర్దశ పట్టనుందా..? మునిసిపాలిటీ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.100కోట్ల పైచిలుకు నిధుల మంజూరుకు ఇకపై మోక్షం లభించనుందా..? డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మదిలో వైరా అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు ఉన్నాయా..? అనే ప్రశ్నలకు అధికార పార్టీ నాయకుల నుంచి అవుననే సమాధానాలొస్తున్నాయి. శనివారం వైరాలో మెగా జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం భట్టి విక్రమార్క కొంతసేపు వైరా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై తమ పార్టీ నాయకులతో మాట్లాడారు. ఈ సమయంలో పట్టణ అభివృద్ధికి సంబంధించి తన మదిలో ఉన్న పలు ఆలోచనలను వారితో పంచుకున్నారు. జాబ్‌మేళాలో కొందరు నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించిన అనంతరం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డితో కలిసి.. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ విజ్ఞప్తి మేరకు ద్వారకానగర్ నుంచి ఇటీవలనే కొత్తగా ఏర్పాటుచేసిన ఎక్సైజ్ స్టేషన్‌కు చెందిన పాత పంచాయతీ భవనానికి వెళ్లారు. అక్కడి నుంచే వైరా రిజర్వాయర్ పరిసరాలను పరిశీలించి వైరా అభివృద్ధికి సంబంధించి తన మదిలో ఉన్న ఆలోచనలను నాయకుల ముందుంచారు. ఇప్పటికే మునిసిపాలిటీ అభివృద్ధి కోసం రూ.100 కోట్ల ప్రతిపాదనల ఆమోదానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారు. మెగా జాబ్‌మేళా సభలోనే వైరాలో అధునాతన ఐటీఐ కాలేజీని నిర్మిస్తానని భట్టి విక్రమార్క ప్రకటించారు.



వైరా వ్యూ



వైరా రిజర్వాయర్

గతేడాది ప్రతిపాదనలు...

గతేడాది ఆగస్టు 15న వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి హాజరైన రైతు సదస్సులో మునిసిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ఆ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత కొన్నినెలలకు మునిసిపాలిటీ అభివృద్ధి కోసం రూ.100కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపించాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఆదేశాలొచ్చాయి. ఆ వెంటనే ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అధికార, ప్రతిపక్ష నాయకులతో సమావేశాన్ని నిర్వహించి మునిసిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం రూ.వందకోట్ల నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపించారు. ఆ ప్రతిపాదనలపై ఆర్థికశాఖ మంత్రి అయిన భట్టి విక్రమార్క ఆమోదం ముద్ర వేయాల్సి ఉంది. ఈ నిధుల మంజూరుకు సంబంధించి శనివారం వైరాలో భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి అవసరమైన ప్రక్రియను వెంటనే పూర్తిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. దీంతో నిధుల మంజూరుకు మోక్షం లభించినట్లేనని అధికార పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 880పనులను రూ.వందకోట్లకు ప్రతిపాదించారు. వాటిలో ముఖ్యంగా మునిసిపాలిటీ డంపింగ్‌యార్డు, అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి రూ.పది కోట్లు, రిజర్వాయర్ ఆనకట్ట అభివృద్ధికి రూ.ఆరున్నర కోట్లు, ప్రధాన రహదారి నుంచి కేవీసీఎం మీదుగా కమ్మవారి కల్యాణ మండపం వరకు రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణానికి రూ.ఐదుకోట్లు, లైబ్రరీ పునర్నిర్మాణానికి రూ.85లక్షలు, జాతీయ ప్రధాన రహదారిలోని సాయిబాబా మందిరం నుంచి రిజర్వాయర్ కుడికాల్వ గట్టును మధిర వెళ్లే ఇందిరమ్మ కాలనీ వరకు అభివృద్ధి చేసేందుకు రూ.ఏడుకోట్లు, వైరాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి దాదాపు రూ.ఆరుకోట్లు, కమ్యూనిటీహాల్స్, డ్రెయినేజీలు, సీసీ రోడ్లు ఇతర అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.వందకోట్లకు ప్రతిపాదనలు పంపించారు. వీటిని వెంటనే మంజూరు చేస్తానని భట్టి విక్రమార్క ఎమ్మెల్యే, ఇతర నాయకులకు స్పష్టతనిచ్చారు.

ఐటీఐ కాలేజీ, ఓపెన్ స్టేడియం నిర్మాణం...

వైరాలోని రిజర్వాయర్ రోడ్డు పక్కనున్న శిథిలావస్థలో ఉన్న ఎన్నెస్పీ క్వార్టర్లను తొలగించి ఆ స్థలంలో ఐటీఐ కాలేజీకి అనుసంధానంగా ఓపెన్ స్టేడియాన్ని నిర్మిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. కేవలం ఓపెన్ స్టేడియం మాత్రమే నిర్మిస్తే దాని నిర్వహణకు అవసరమైన నిధుల సమస్య ఉంటుందని అందువలన ఆపక్కనే ఉన్న జూనియర్ కాలేజీ, హైస్కూళ్ల మాదిరిగానే ఐటీఐ కాలేజీకి అనుసంధానంగా ఓపెన్ స్టేడియాన్ని నిర్మిస్తే దాని నిర్వహణకు నిధుల సమస్య ఉండదని, ఆక్రమణలను నిరోధించవచ్చునని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

వైరా రిజర్వాయర్‌లో నూతన రింగ్‌బండ్...

వైరా పాత పంచాయతీ కార్యాలయం నుంచి రిజర్వాయర్ సరిహద్దుగా ప్రస్తుతం ఉన్న ఆనకట్ట వరకు అన్నిహంగులతో రింగ్‌బండ్ నిర్మించాల్సిన అవసరం గురించి భట్టి విక్రమార్క తన ఆలోచనలను నాయకుల ముందు వెల్లడించారు. పాత పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన సమయంలో రిజర్వాయర్‌ను పరిశీలించి సత్రంబజార్ నుంచి ద్వారకానగర్‌ను అనుసంధానిస్తూ మాటూరుపేట కాలనీ మీదుగా రిజర్వాయర్ కుడికాల్వ ప్రధాన లాకుల వద్ద కొత్తగా ఒక వంతెనను నిర్మించి రింగ్‌బండ్‌ను ఆనకట్టకు అనుసంధానం చేసి అభివృద్ధి చేయాలని ఆయన భావిస్తున్నారు. అంతేకాకుండా పాత పంచాయతీ కార్యాలయం వద్దనే బోటుషికార్‌ను ఏర్పాటుచేయాలనే ఆలోచనను కూడా ఆయన వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లో చేపలు పట్టే సమీపంలో బోటుషికారుకు మత్స్యకారుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నందున ఆపరిస్థితిని నిరోధించేందుకుగానూ ప్రత్యేకంగా రిజర్వాయర్‌లో కొంత పరిధిని బోటుషికారుకు పరిమితం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ ఆలోచనలన్నీ కార్యరూపం దాల్చటానికిగానూ వెంటనే హైదరాబాద్ వచ్చి పర్యాటకశాఖ అధికారులను కలిసి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్ నాయకులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. వైరా చరిత్రకు ఆనవాలుగా ఉన్న పాత పంచాయతీ భవనాన్ని నీటిపారుదలశాఖ విశ్రాంతి భవనాన్ని అన్ని హంగులతో పునర్నిర్మించాల్సిన అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అలాగే వైరాలోని జాతీయ ప్రధాన రహదారిపై రింగ్‌రోడ్డు నిర్మాణ ప్రస్తావన కూడా వచ్చింది. ఇప్పటికే రూ.వందపడకల ఆసుపత్రి నిర్మాణ దశలో ఉంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైంది. రూ.42.10కోట్లతో వైరా కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ పనులు మొదలయ్యాయి. దాదాపు రూ.45కోట్లతో స్నానాల లక్ష్మీపురం నుంచి గండగలపాడు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు వెడల్పు, స్నానాల లక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు, అక్కడే వైరా నదిలో చెక్‌డ్యాం, నదికి రెండువైపులా రక్షణ గోడలు నిర్మిస్తున్నారు. అలాగే రూ.వందకోట్లతో నిర్మించిన రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తీసుకొచ్చి ఈ ఏడాది ముందుగానే వరిసాగు చేసే అవకాశాల గురించి ఆయన ప్రస్తావించారు. రూ.12కోట్లతో చేపట్టిన అసంపూర్తిగా ఉన్న మధిర-జగ్గయ్యపేట రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయించాలని నాయకులు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం



రైతులకు విత్తనాలు అందిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహారావు

మధిరటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహరావు అన్నారు. సోమవారం మధిర సొసైటీలో రైతులకు రాయతీపై వరి విత్తనాలు, జీలుగులను సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణప్రసాద్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా రైతులకు అండాగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వరి సన్నాలు పండించే రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ క్వింటాలకు ఐదు వందల రూపాయలు బోనస్ అందిస్తుందని అన్నారు. ఏడీఏ విజయ్‌చందర్, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది సుబ్బారావు, కేఎస్‌ఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంపాడులో జీలుగ విత్తనాలు అందజేత

మధిరరూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): రైతులు జీలుగు విత్తనాలను సద్వినియోగించుకోవాలని ఏడీఏ విజయచంద్ర రైతులకు సూచించారు. సోమవారం మధిర మండలంలోని ఖమ్మంపాడులో రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. జీలుగులు వాడడంతో రసాయన ఎరువుల ఉపయోగం తగ్గుతుందన్నారు. రైతులకు జీలుగులు సక్రమంగా అందేలా చూడాలని ఏడీఏ ఆదేశించారు. జీలుగులు పంపిణీలో ఫీల్డ్ సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంపాడు ఏఈవో సీహెచ్ సుష్మ, పీఏసీఎస్ సీఈవో శ్రీనిఆసరెడ్డి, సీహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత టీచర్‌కు ఎంవీఎల్‌ఏ అవార్డు



అవార్డు అందుకుంటున్న విశ్రాంత టీచర్ బత్తుల సుజాత

వైరా, మే 26 (ఆంధ్రజ్యోతి): పలు గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా, ప్రిన్సిపల్‌గా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను వివిధ రంగాల్లో ప్రోత్సహించిన విశ్రాంత ఉపాధ్యాయురాలు బత్తుల సుజాతకు మోటివేషనల్ విజనరీ లోడింగ్(ఎంవీఎల్ఏ)అవార్డు లభించింది.గ్లోబల్ స్థాయిలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేసిన ఉపాధ్యాయులకు ఈ అవార్డును ప్రధానం చేస్తారు. ఇందులో భాగంగా సుజాత ఈ అవార్డును అందుకున్నారు. వైరాలోని తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయంలో సుజాత పనిచేసిన సమయంలో సైన్స్ విషయంలో విద్యార్థులను జాతీయస్థాయిలో రాణించేలా చేయడం, పాఠశాలలో అటల్‌ల్యాబ్ ఏర్పాటుకు కృషిచేయడం, కేజీబీవీ ఖమ్మం రూరల్‌లో స్పెసలాఫీసర్‌గా పనిచేసిన సమయంలో రూ.మూడుకోట్లు విలువ చేసే భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడినందుకు జిల్లా కలెక్టర్ నుంచి సర్వీస్ అవార్డు తీసుకున్నందుకు, స్కౌట్ అండ్ గైడింగ్‌లో 12మందిని రాష్ట్రపతి గైడ్స్‌ని తయారుచేసినందుకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్నందుకుగానూ ఈ ఎంవీఎల్ఏ అవార్డును ఆదివారం హైదరాబాద్‌లో జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ చేతులమీదుగా సుజాత అందుకున్నారు. ఆమెను పలువురు ఉపాధ్యాయులు, మిత్రులు అభినందించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

చింతకాని, మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వత్సవాయి జానకిరాములు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీల డిమాండ్ల పరిష్కారం కొరకు మే 30వ తేదీన ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎర్రుపాలెంలోని డీసీసీబీలో పెద్దగోపవరం వ్యవసాయసహకార సంఘం ఆధ్వర్యంలో సభ్యుడికి బీమా నగదును సోమవారం అందించారు సొసైటీ పరిధిలోని సహకార సంఘం సభ్యులైన బనిగండ్లపాడు గ్రామానికి చెందిన ఉబడం సీతామహాలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమెకు పెద్దగోపవరం సహకార సంఘంలో సభ్యత్వం ఉండడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేల బీమా నగదును ఆమె భర్త బుడం శ్రీనివాసరావుకు సొసైటీ అధ్యక్షుడు శీలం అక్కిరడెడ్డి అందించారు. ఈ సందర్భగా అక్కిరెడ్డి మాట్లాడుతూ.. సంఘం సభ్యులైన సీతామహాలక్ష్మి మృతి బాధాకరమన్నారు. అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, సొసైటీ సిబ్బంది , బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏన్కూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరిత్యాల పట్ల అధికారులు, ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శేషగిరారావు, ఎంపీడీవో జీవీఎస్ నారాయణ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ.. ఆకస్మిక వరదలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వరదల వల్ల పంటనష్టం జరిగితే వెంటనే నరష్టానికి సంబంధించిన నివేదికలు తయారు చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గన్నార.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కెనాల్‌లో భూములు కోల్పోయిన రైతులకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సోమవారం పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. సత్తుపల్లి మండలం రేజర్ల, కొత్తూరు గ్రామాల రైతులు ఎన్టీఆర్ కెనాల్‌లో భూములు కోల్పోయారు. వీరిలో 25 మంది రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. ఏడేళ్లుగా రైతులు పరిహారం కోసం తిరుగుతున్నా వారి సమస్య పరిష్కారం కాలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుల సమస్య పరిష్కారం అయిందని ఎమ్మెల్యే రాగమయి అన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

సత్తుపల్లి ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాతాశిశు వార్డులను పరిశీలించి వారికి అందిస్తున్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జనరల్ వార్డులో రోగులను కలుసుకుని వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ కాలేజి, అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులను పరిశీలించారు.

జాబ్‌మేళాలో 4,040మందికి నియామక పత్రాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వైరా, మే 26 (ఆంధ్రజ్యోతి): మెగా జాబ్‌మేళాలో 4040మంది నిరుద్యోగులకు నియామక పత్రాలు జారీ చేశామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. సోమవారం వైరాలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జాబ్‌మేళాను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో సింగరేణి కాలరీస్ సహకారంతో ఈ జాబ్‌మేళా నిర్వహించామని తెలిపారు. జాబ్‌మేళాకు ఆన్‌లైన్ ద్వారా 9400మంది, ఆఫ్‌లైన్ ద్వారా 3వేల మంది మొత్తం 12,400మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. 8889మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని చెప్పారు. రెండు విడతల్లో 4040మందికి నియామక పత్రాలు అందించామని పేర్కొన్నారు. మెగా మేళ ఏర్పాటుకు చొరవ తీసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సహకరించిన సింగరేణి కాలరీస్ సీఎండీ బలరాం, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, సూరంపల్లి రామారావు, కట్ల సంతోష్, పణితి శ్రీను, శీలం చంద్రశేఖరరెడ్డి, బొళ్ల గంగారావు, శబరీనాథ్, రాంపూడి రోశయ్య, నర్వనేని అశోక్, ధార్న రాజశేఖర్, యన్నం వెంకటకోటారెడ్డి పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

వైరా, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి పాలకమండలిని ఏర్పాటుచేసి అవసరమైన మేరకు నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం వైరాలో మచ్చా మణి అధ్యక్షతన సీపీఎం డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. నున్నా మాట్లాడుతూ 20నెలలుగా గ్రామాలు, మండలాల్లో పాలకవర్గాలు లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు అందక సమస్యలు పేరుకుపోయాయని వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా, డివిజన్ నాయకులు సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, దుగ్గి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, దొంతబోయిన నాగేశ్వరరావు, తోట నాగేశ్వరరావు, కె.నరేంద్ర, చెరుకుమల్లి కుటుంబరావు, అంబడి శ్రీనివాసరెడ్డి, వజ్జా రామారావు, బాణోతు బాలాజీ, బాదావత్ శ్రీనివాస్, తాతా పద్మ, బోయినపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తుల స్వీకరణ

- కల్లూరు డివిజన్లో జూన్ 3 నుంచి
- ఆర్డీవో రాజేంద్రగౌడ్



కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేంద్రగౌడ్

కల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరు డివిజన్ పరిధిలోని ఆరు మండలాలలో జూన్ 3వతేది నుంచి భూ భారతి దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరిస్తున్నట్లు స్థానిక ఆర్డిఓ ఎల్.రాజేంద్రగౌడ్ చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవచ్చిన భూ భారతి చట్టం అమలులో భాగంగా భూ సమ్యస్యల పరిష్కారానికి గాను జూన్ 3 వ తేది నుంచి 20 తేది వరకు మండలాల పరిధిలో గల గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జరుగనున్నదన్నారు. ప్రతి మండలానికి తహసిల్దార్, డిప్యూటీ తహిసిల్దార్ స్థాయిలో రెండు బృందాలు పని చేస్తాయని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఆయా మండలాల వారిగా రోజుకు రెండు గ్రామాల చొప్పున ఈ ప్రక్రియ సాగుతుందని ఆర్డిఓ రాజేంద్రగౌడ్ తెలిపారు. ఇలా దరఖాస్తుల స్వీకరణ అనంతరం జూన్ 21 తేది నుంచి రెవెన్యూ బృందాలు భూ స్వభావం సమాచారం తెలుసుకునేలా క్షేత్ర స్థాయిలో సందర్శిస్తారని ఆయన పేర్కొన్నారు. గ్రామాలలో పర్యటించిన సమయంలో భూ సమస్యల్లో ప్రధానంగా సాదాబైనామాలు, మిస్సింగ్ సర్వేలు, ఆర్ఎస్, భూముల వ్యత్యాసాలు, భూ సవరణ తదితర వాటిపై విచారణలు కూడ ఉంటాయని ఆర్డిఓ వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

- ఆర్డీవోకు బీజేపీ నాయకుల వినతి



ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న బిజెపి నాయకులు

కల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందించాలని సోమవారం కల్లూరులో బీజేపీ ఆధ్వర్యంలో ఆర్డిఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బిజెపి ఖమ్మం పార్లమెంటరీ జిల్లా కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ప్రసంగిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులను ఎంపిక చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల బంధువులకు మాత్రమే ఆయా ప్రభుత్వ పథకాలకు లబ్దిదారులుగా ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ జెండా మోసిన వారికి కాకుండ నాయకుల బంధువులకు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస్‌లకు ఎంపికలు చేస్తున్నట్లు కాంగ్రెస్ వారే స్వయంగా తమకు చెప్తున్నారన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ గృహాలు మంజూరు కాగా అందులో కనీసం 1000 మందికైన అర్హులైన వారికి న్యాయం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. అర్హులైన వారికి న్యాయం జరగకపోతే వారం తర్వాత బిజెపి తరుపున ఆందోళన చేస్తామని నంబూరి చెప్పారు. బిజెపి రాష్ట్ర నాయకులు ఈవి.రమేష్, జె.నరేష్, బి.వీరంరాజు, మండల బిజెపి అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ, నాయకులు అనిల్, కృష్ణ పుల్లారావు,శివకృష్ణ పాల్గొన్నారు.

సైకిల్ యాత్రను జయప్రదం చేయండి

తల్లాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 30వతేదీ నుంచి ఖమ్మం జిల్లాలో నిర్వహించే యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు సత్తెనపల్లి నరేష్ కోరారు. సోమవారం తల్లాడలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విచ్చలవిడిగా ఏరులై పారుతున్న మద్యం, డ్రగ్స్, గంజాయి, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్, మాదకద్రవ్యాలను నిషేధించాలని, యువతలో చైతన్యం తెచ్చేందుకు సైకిల్ యాత్ర చేపట్టినట్టు వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అర్హులైనవారికి ఎటువంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించాలన్నారు. యువచైతన్య సైకిల్ యాత్ర12 రోజులపాటుజిల్లాలోని 136 గ్రామాల్లో జరుగుతుందని జులై1 వతేదీన తల్లాడకు వస్తుందన్నారు.

సంక్షేమ పథకాల్లో అర్హులకు అన్యాయం



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తల్లాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారుల ఎంపికలో అర్హులను విస్మరించి రాజకీయ ఒత్తిళ్లతో తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ ఆరోపించారు. సోమవారం ఖమ్మం ఐడీసీలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి ప్రతినిధి బృందం వినతిపత్రం అందించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత నేటి వరకు పాలకుల వల్ల ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు, నిరుద్యోగులకు అందించడంలేదనేది వాస్తవమన్నారు. ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ప్రభుత్వ ఉద్యోగులనుద్దేశించి రాజకీయ నాయకుల ఒత్తిళ్ళకు తలొగ్గి నిజమైన లబ్దిదారులకు అన్యాయం చేస్తే ఉద్యోగాలు కోల్పోతారని హెచ్చరించినప్పటికి ఈ రెండు పథకాల్లో జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదు గురు సభ్యులతో కమిటీని నియమించి వారికి నచ్చినవారికి మాత్రమే ఇళ్లు, లోన్లు ఇప్పిస్తూ నిజమైన లబ్దిదారులను విస్మరిస్తూ ప్రభుత్వ ఆశయాలకు గండికొడుతున్నారని అన్నారు. ఎంఆర్‌పీఎస్ ఎంఎస్పీ ఖమ్మంజిల్లా ఇన్‌చార్జి ఇసనపల్లి అశోక్, సునిల్, ఆనందరావ, బాబు పాల్గొన్నారు.

ఒకే ఉద్యోగికి 3 కీలక బాధ్యతలు

- ఛాలెంజ్‌గా తీసుకుని సమర్థవంతంగా నిర్వహణ



జీవీఎస్ నారాయణ

ఏన్కూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఉద్యోగులు తమకున్న ఒక్క ఉద్యోగ విధులు నిర్వహించడానికే తలమునకలై పోతుంటారు. అలాంటి ఓ ఉద్యోగి 2 కీలక ఉద్యోగ బాధ్యతలు విజయవంతంగా నిర్వహించడం విశేషం. అయినా తనకు అప్పగించిన ఆ బాధ్యతలను ఛాలెంజ్‌గా తీసుకుని విధులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నాడు. ఆదర్శ ఉద్యోగిగా పలువురు మన్ననలు పొందుతూ ఉన్నతాధికారులతో శభాష్ అనిపించుకుంటున్నాడు. ఆ అధికారే జీవీఎస్ నారాయణ. ఏన్కూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీవోగా పనిచేస్తున్న జీవీఎస్ నారాయణకు ఈ ఏడాది మార్చి 26న కల్లూరు డీఎల్‌పీవోగా అదనపు కీలక బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ఏప్రిల్ 29న ఎంపీడీవో రమేశ్ పదవీ విరమణ పొందడంతో ఆ బాధ్యతలను కూడా నారాయణకు అప్పగించారు. అప్పటి నుంచి ఎంపీవో, ఎంపీడీవో, డీఎల్‌పీవో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఎటువంటి వివాదాలు లేకుండా సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారు. నేరుగా ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారు. డీఎల్‌పీవోగా గ్రామపంచాయతీల పర్యవేక్షణ, గ్రామపంచాయతీలను 3 నెలలకు ఒకసారి సందర్శించడం, డీపీవో ఆదేశాలనుపాటించడం ఎంపీడీవోగా మండలంలోని అభివృద్ధి పనులు పర్యవేక్షించడం , ఈజీఎస్ పనులు పర్యవేక్షణ, తాగునీటి, పారిశుధ్య పనులుపర్యవేక్షణ ఉంటుంది. ఎంపీవోగా గ్రామపంచాయతీల పర్యవేణ , బడ్జెట్ ఆమోదం, జిల్లా అధికారుల ఆదేశాలను పాటించడం పారిశుధ్యం, తాగునీటి, విద్యుత్‌సరఫరా సక్రమంగా జరిగేటట్లు చూడడం ఉద్యోగ బాధ్యతలు తూచా తప్పకుండా పాటిస్తున్నాడు వీటితోపాటు ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్ యువ వికాసం సంక్షేమపథకాలను సమర్థంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలుపొందుతున్నాడు 3 ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తున్న ఉద్యోగికి వాహన సదుపాయం లేకపోవడం విధులకు కొంత ఆటంకం కలుగుతుంది.